


'రాజముద్ర' తెలుగు దినపత్రికలో
ప్రకటనల కోసం సంప్రదించగలరు
సెల్ : 9182 474 575



www.rajamudranews.com

అక్షర

# రాజముద్ర

ప్రతి అక్షరం - ప్రజల కోసం | తెలుగు దిన పత్రిక

AKSHARA RAJAMUDHRA | RNI No: TELTEL/2024/86684

| మేడ్చల్-మల్కాజ్ గిరి | శుక్రవారం | 25-09-2026 | సంపుటి: 3 | సంచిక: 232 | పేజీలు : 8 | వెల : 2/- |
|---|---|---|---|---|---|---|
| MEDCHAL-MALKAJGIRI | FRIDAY | 25-09-2026 | VOLUME : 3 | ISSUE : 232 | PAGES: 8 | COST: 2/- |



## విలేకరులు కావలెను

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో పని చేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.

సంప్రదించాల్సిన చిరునామా..

సెల్ : 9182 474 575


## గ్రామ హద్దులు చూపిన తర్వాతే నోటీసులివ్వాలి

- నోటీసులు తిరస్కరించిన రైతులు
- రికార్డుల ప్రకారం న్యాయంగా సర్వే చేసి న్యాయం చేయండి
- శివారు వెంకటాపూర్ రైతుల స్పష్టీకరణ
- సీఎం, కలెక్టర్ న్యాయం చేయాలని వేడుకున్న రైతులు

2



## 22ఏ భూముల రిజిస్ట్రేషన్లకు గ్రీన్‌సిగ్నల్

- జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, డీటీసీపీ అనుమతులున్న ప్లాట్లకు అవకాశం
- 22ఏ జాబితాలో ఉన్నా ఆమోదిత లేఅవుట్లకు రిజిస్ట్రేషన్లు
- తక్షణమే అమల్లోకి ప్రభుత్వ తాజా ఆదేశాలు
- నిలిచిపోయిన వేలాది ఆస్తుల లావాదేవీలకు మార్గం సుగమం
- • ప్లాట్ల యజమానులు, గృహ కొనుగోలుదారులకు ఊరట

3




## తెరపైకి బీఆర్ఎస్ నేతల భూములు

- కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు సహా పలువురికి సంబంధించిన భూములపై విచారణ
- శ్రీదేవసేన నేతృత్వంలో ఉన్నతస్థాయి కమిటీ ఏర్పాటు
- వివిధ జిల్లాల్లో 16 భూ అంశాలపై ప్రభుత్వ ఆరా
- సెక్షన్ 22-ఎ సహా చట్టాలు, నిబంధనల ఉల్లంఘనపై పరిశీలన
- బాధ్యులను గుర్తించి చర్యలకు సిఫార్సు చేయనున్న కమిటీ

2

## దానం పార్టీ ఫిరాయింపు తప్పే



- హైకోర్టు తీర్పును సమర్థించిన సుప్రీం కోర్టు
- మళ్లీ ఎన్నికలకు వెళ్లాల్సిందే

**దిల్లీ, సెప్టెంబర్ 24 :**

దానం నాగేందర్‌పై రాష్ట్ర హైకోర్టు అనర్హత వేటు వేయడాన్ని సుప్రీం కోర్టు సమర్థించింది. హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ దానం దాఖలు చేసిన పిటిషన్ సుప్రీంకోర్టులో గురువారం విచారణ జరగగా సీజేఐ జస్టిస్

మిగతా 3వ పేజీలో..

## సుప్రీం కోర్టు తీర్పును స్వాగతిస్తున్నాం

- అంతిమంగా సత్యానిదే గెలుపు
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు

3

## ఉప ఎన్నికకు సిద్ధం

- సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తున్నా : దానం నాగేందర్
- చట్టపరంగా ప్రయత్నించడంలో తప్పులేదని వ్యాఖ్య

3

## సుప్రీం తీర్పు కాంగ్రెస్, బీఆర్ఎస్‌లకు గుణపాఠం

- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

3



## 2030 నాటికి పేదరిక రహిత రాష్ట్రంగా

# తెలంగాణ

- 2033 నాటికి అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థకు కార్యాచరణ
- టీఎస్‌డీపీఎస్ బలోపేతం.. ప్రత్యేక పీఎంయూ ఏర్పాటు
- జిల్లా అభివృద్ధి ప్రణాళికలు, ఏడు సెక్టోరల్ గ్రోత్ ల్యాబ్స్‌కు రూపకల్పన
- ప్రభుత్వం-జీఎఫ్ఎస్‌టీ భాగస్వామ్యానికి ప్రతిపాదన

**హైదరాబాద్, సెప్టెంబర్ 24 :**

తెలంగాణను 2030 నాటికి పేదరిక రహిత రాష్ట్రంగా, 2033 నాటికి దేశంలోనే తొలి అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థ కలిగిన రాష్ట్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి కార్యాచరణకు మరింత వేగం పెంచనుంది. రాష్ట్ర దీర్ఘకాలిక ఆర్థిక, సామాజిక అభివృద్ధి లక్ష్యాలను వేగంగా సాధించేందుకు చేపట్టాల్సిన కార్యాచరణపై ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధ్యక్షతన ఉన్నతస్థాయి సమావేశం గురువారం జరిగింది. ఆర్థిక, ప్రణాళిక శాఖల కార్యదర్శులతోపాటు పలువురు ఉన్నతాధికారులు సమావేశంలో పాల్గొన్నారు. ఉప ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ సమావేశానికి ఆంధ్రప్రదేశ్ మాజీ ప్రధాన కార్యదర్శి, హైదరాబాద్‌కు చెందిన జీఎఫ్ఎస్‌టీ వైస్ చైర్మన్ ఎస్.పి.టక్కర్‌తోపాటు సంస్థ ప్రతినిధులు హాజరయ్యారు. రాష్ట్ర అభివృద్ధి ప్రణాళిక, అమలు వ్యవస్థలను మరింత బలోపేతం చేయడం, శాఖల మధ్య సమన్వయాన్ని పెంచడం, అభివృద్ధి ఫలితాలను నిరంతరం

మిగతా 2వ పేజీలో..




## అంతర్జాతీయ పర్యాటక గమ్యస్థానంగా తీర్చిదిద్దాలి

- తెలంగాణ బ్రాండ్‌ను ప్రపంచానికి పరిచయం చేయాలి
- చారిత్రక కట్టడాల పరిరక్షణ, ఆదాయ వనరుల పెంపునకు ప్రణాళికలు
- పర్యాటక రంగంలో పెట్టుబడులు పెంచాలి
- అధికారులకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క దిశానిర్దేశం

2



## ద్విచక్ర వాహనం ఢీకొని ఎస్సై మృతి

- గణేష్ నిమజ్జనోత్సవాల వేళ విషాదకర ఘటన

2



## డీఎస్పీ భీమ్‌రెడ్డి బినామీల ఇళ్లల్లో సోదాలు

- కీలకపత్రాలు స్వాధీనం చేసుకున్న ఏసీబీ
- బయటపడ్డ కట్టలకొద్దీ నోట్లు

2




## గణేష్ నిమజ్జనానికి ఆర్టీసీ భారీ ఏర్పాట్లు

- 700 ప్రత్యేక బస్సులు
- భక్తుల సౌకర్యార్థం 24 గంటలపాటు ప్రత్యేక బస్సులు
- 26న తెల్లవారుజామున 1 గంట వరకు మెట్రో సేవల పొడిగింపు

2

## ఎన్నికల సంఘం నిరంకుశ ధోరణి



- ముగ్గురిలో ఇద్దరు వ్యతిరేకిస్తే అది మెజారిటీయే కదా
- మరి ప్రజాస్వామ్యాన్ని ఇంకెవరు కాపాడాలి?
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**హైదరాబాద్, సెప్టెంబర్ 24:**

ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా చెప్పుకునే మన దేశంలో ప్రజాస్వామ్యాన్ని కాపాడాల్సిన ఎన్నికల సంఘం తీరు దాదాపు నియంతృత్వ ధోరణిలోకి వెళ్తున్నదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆందోళన వ్యక్తం చేశారు. ముగ్గురు ఎన్నికల కమిషనర్లలో ఇద్దరు పదేపదే అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నప్పుడు ఎన్నికల సంఘం పనితీరును సరిదిద్దాల్సిన

మిగతా 3వ పేజీలో..



## క్షుద్రపూజల ఆరోపణలపై పరువు నష్టం కేసు

- తప్పుడు ప్రచారం చేస్తే కోర్టుకు ఈడుస్తాం
- ఎంతటివారినైనా వదిలిపెట్టేది లేదు
- దానం విషయంలో కోర్టు తీర్పు రేవంత్కు చెంపపెట్టు
- మిగిలిన ఎమ్మెల్యేలతో కూడా రాజీనామా చేయించాలి
- మాజీ మంత్రి హరీష్ రావు

2

## నేడు సీఎం రేవంత్‌కు 'ముహమ్మద్' అవార్డు ప్రదానం

3

# తెరపైకి బీఆర్ఎస్ నేతల భూములు

**హైదరాబాద్, సెప్టెంబరు 24:**

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి సహా పలువురు బీఆర్ఎస్ నేతలు, వారి కుటుంబ సభ్యులు, సన్నిహితులతో సంబంధం ఉన్నట్లు పేర్కొన్న భూములపై తెలంగాణ ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. వివిధ జిల్లాల్లోని భూములకు సంబంధించి అక్రమాలు జరిగాయన్న ఆరోపణలపై వాస్తవాలను తేల్చేందుకు ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేసింది. ఈ మేరకు ప్రభుత్వం జీఓ ఎంఎస్ నంబర్ 134 జారీ చేసింది.

**శ్రీదేవసేన నేతృత్వంలో విచారణ**

కాలేజియేట్, సాంకేతిక విద్య కమిషనర్ ఎ. శ్రీదేవసేనను కమిటీ చైర్‌పర్సన్‌గా నియమించారు. స్టాంపులురిజిస్ట్రేషన్ల శాఖ ప్రత్యేక కార్యదర్శి రాజీవ్‌గాంధీ హనుమంతు కన్వీనర్‌గా, జనగామ కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా సభ్యుడిగా వ్యవహరిస్తారు. విచారణకు సంబంధించిన భూమి ఏ జిల్లాలో ఉంటే ఆ జిల్లా కలెక్టర్ కూడా కమిటీలో సభ్యుడిగా ఉంటారు.

**సెక్షన్ 22-ఎ చర్చతో కదలిక**

రిజిస్ట్రేషన్ చట్టంలోని సెక్షన్ 22ఎకు సంబంధించిన అంశాలపై సెప్టెంబరు 16న శాసనసభలో జరిగిన చర్చ అనంతరం ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వ, సీలింగ్ మిగులు, అసైన్డ్, జాగీర్, భూదాన్, ఇనామ్, అటవీ భూములతోపాటు భూసేకరణ, పునరావాసం, జలవనరులు, వాటి పరివాహక ప్రాంతాలకు సంబంధించిన భూ వ్యవహారాలను కమిటీ పరిశీలించనుంది. సిద్దిపేటలోని ఎర్రవల్లి, మర్కూక్, రామంచ ప్రాంతాలతోపాటు రంగారెడ్డి జిల్లాలోని జన్వాడ, అజీజ్‌నగర్, వట్టినాగులపల్లి తదితర ప్రాంతాలకు సంబంధించిన అంశాలు విచారణ పరిధిలో ఉన్నాయి. రాజన్న సిరిసిల్ల జిల్లాలో ప్రభుత్వ, అసైన్డ్ భూముల కేటాయింపులు, మిడ్‌మానేరు పరిహారం, పునరావాస ప్యాకేజీలకు సంబంధించిన ఆరోపణలనూ పరిశీలించనున్నారు. మొత్తం 16 భూ అంశాలు విచారణ జాబితాలో ఉన్నట్లు ప్రచురిత వివరాలు వెల్లడిస్తున్నాయి.

అవసరమైన రికార్డులు, పత్రాలు, సమాచారం కోరే అధికారాన్ని కమిటీకి ప్రభుత్వం కల్పించింది. విచారణలో ఉల్లంఘనలు నిర్ధారణైతే బాధ్యులను గుర్తించి తగిన చర్యలను సిఫార్సు చేయనుంది. అవసరమైతే నిర్దిష్ట అంశాలపై మధ్యంతర నివేదికలు కూడా సమర్పించవచ్చు.

# అంతర్జాతీయ పర్యాటక గమ్యస్థానంగా తీర్చిదిద్దాలి

**హైదరాబాద్, సెప్టెంబర్ 24 :**

రాష్ట్రంలో పర్యాటక రంగాన్ని మరింత అభివృద్ధి చేసి, రాష్ట్రాన్ని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రముఖ పర్యాటక గమ్యస్థానంగా తీర్చిదిద్దేందుకు సమగ్ర కార్యాచరణ రూపొందించాలని ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క, పర్యాటక సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావులు అధికారులను ఆదేశించారు. పర్యాటక అభివృద్ధి అంటే పర్యాటక ప్రదేశాలను అభివృద్ధి చేయడం మాత్రమే కాదని, తెలంగాణ బ్రాండ్‌ను ప్రపంచానికి పరిచయం చేయడం కూడా అందులో భాగమేనని అన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యంతో పెట్టుబడులు, ఉపాధి, ఆదాయ అవకాశాలను పెంచుతూ రాష్ట్ర పర్యాటక రంగాన్ని కొత్త స్థాయికి తీసుకెళ్లాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ప్రజా భవన్‌లో పర్యాటక, సాంస్కృతిక శాఖల ఉన్నతాధికారులతో భట్టి విక్రమార్క గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలోని పర్యాటక ప్రాజెక్టులు, శాఖ పరిధిలోని ఆస్తుల వినియోగం, బడ్జెట్ కేటాయింపులు, ప్రైవేట్ పెట్టుబడులు, చారిత్రక కట్టడాల పరిరక్షణ, పర్యాటక బ్రాండింగ్ తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు. డిప్యూటీ సీఎం మాట్లాడుతూ పర్యాటక రంగంలో ప్రభుత్వ పెట్టుబడులతోపాటు ప్రైవేట్ భాగస్వామ్యాన్ని విస్తృతం చేయాలని, పబ్లిక్‌ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్ (పీపీపీ) విధానంలో కొత్త ప్రాజెక్టులను అభివృద్ధి చేయాలని సూచించారు. ప్రభుత్వ నిధులపై ఆధారపడకుండా పర్యాటక శాఖ ఆస్తులను సమర్థంగా వినియోగించుకోవాలని సూచించారు. భవనాలు ఉన్న ఆస్తులు, ఖాళీ స్థలాలు, పీపీపీ విధానంలో అభివృద్ధి చేయడానికి అవకాశం ఉన్న ప్రాంతాలను గుర్తించి ప్రత్యేక జాబితా రూపొందించాలని అధికారులను ఆదేశించారు.

**టూరిజం ద్వారా గ్లోబల్ గుర్తింపు**

రాష్ట్రంలో టెంపుల్ టూరిజం, ఎకో టూరిజం, హిల్ టూరిజం తదితర విభాగాలను సమగ్రంగా అభివృద్ధి చేయాలన్నారు. చారిత్రక, సాంస్కృతిక, ఆధ్యాత్మిక, ప్రకృతి పర్యాటక ప్రాంతాలను ప్రపంచ పర్యాటక పటంలో నిలిపేలా విస్తృత స్థాయిలో బ్రాండింగ్, మార్కెటింగ్ కార్యక్రమాలు చేపట్టాలని భట్టి విక్రమార్క సూచించారు. హైదరాబాద్‌కు వచ్చే దేశీయ, విదేశీ పర్యాటకులను రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలకు ఆకర్షించేలా ప్రత్యేక పర్యాటక సర్క్యూట్లను అభివృద్ధి చేయాలని చెప్పారు. పర్యాటక ప్రాంతాల్లో హోటళ్లు, రిసార్టులు, ఇతర మౌలిక వసతుల అభివృద్ధికి ప్రైవేట్ రంగాన్ని భాగస్వామ్యం చేయాలన్నారు.

**చారిత్రక సంపద పరిరక్షణకు ప్రభుత్వ మద్దతు**

రాష్ట్రంలోని చారిత్రక కట్టడాలు, వారసత్వ సంపదను కాపాడుకోవడం ప్రభుత్వ బాధ్యతలో కీలక భాగమని ఉప ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. రామప్ప వంటి చారిత్రక ప్రదేశాల్లో పరిరక్షణ, నిర్వహణ, మౌలిక వసతుల కల్పనకు అవసరమైన ప్రభుత్వ సహకారం అందిస్తామన్నారు. అదే సమయంలో కొత్త పర్యాటక ప్రాజెక్టుల ద్వారా ఆదాయాన్ని పెంచుకునే మార్గాలను అన్వేషించాలని సూచించారు. ప్రభుత్వ బాధ్యతగా చేపట్టాల్సిన పరిరక్షణ కార్యక్రమాలు, ప్రైవేట్ భాగస్వామ్యంతో చేపట్టగల అభివృద్ధి ప్రాజెక్టుల మధ్య సమతుల్యత పాటించాలన్నారు.

**'తెలంగాణ దర్శిని'కి ప్రాధాన్యం**

విద్యార్థుల్లో తెలంగాణ చరిత్ర, సంస్కృతి, పర్యాటక ప్రాంతాలపై అవగాహన పెంచేందుకు తెలంగాణ దర్శిని కార్యక్రమాన్ని సమర్థంగా అమలు చేయాలని సమావేశంలో చర్చించారు. విద్యార్థులను చారిత్రక ప్రదేశాలు, మ్యూజియంలు, ప్రముఖ పర్యాటక ప్రాంతాలకు తీసుకెళ్లడం ద్వారా రాష్ట్ర వారసత్వంపై వారికి అవగాహన కల్పించాలని సూచించారు. పర్యాటక రంగంపై చిన్న వయసు నుంచే ఆసక్తి పెంచడంతో పాటు భవిష్యత్ తరాలకు తెలంగాణ చారిత్రక, సాంస్కృతిక వైభవాన్ని పరిచయం చేయడమే ఈ కార్యక్రమం లక్ష్యమని అధికారులు వివరించారు.

**పెట్టుబడుల ఆకర్షణలో సమస్యలను పరిష్కరించాలి**

పర్యాటక ప్రాజెక్టులకు ప్రైవేట్ పెట్టుబడులను ఆకర్షించే విషయంలో ఉన్న సమస్యలను గుర్తించి పరిష్కరించాలని భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. లీజు విధానాలు, ప్రాజెక్టుల ఆర్థిక సాధ్యత, పెట్టుబడిదారుల ఆసక్తి వంటి అంశాలను సమగ్రంగా పరిశీలించి అవసరమైన మార్పులపై ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. పర్యాటక, సాంస్కృతిక రంగాల అభివృద్ధికి అవసరమైనచోట అన్ని శాఖల అధికారులతో ఉమ్మడి సమావేశాలు నిర్వహించి సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. తెలంగాణ చరిత్ర, సంస్కృతి, ప్రకృతి వైభవాన్ని ప్రపంచానికి పరిచయం చేస్తూ పెట్టుబడులు, ఉపాధి, ఆదాయం పెరిగేలా పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. సమావేశంలో ఫైనాన్స్ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా, టూరిజం ప్రిన్సిపల్ సెక్రటరీ వాణి, ఫైనాన్స్ ప్లానింగ్ సెక్రటరీ గౌరవ్ ఉప్పల్, ఫైనాన్స్ సెక్రటరీ స్నిగ్ధా పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# ద్విచక్ర వాహనం ఢీకొని ఎస్సై మృతి

**హైదరాబాద్, సెప్టెంబర్ 24:**

హైదరాబాద్ గణేష్ నిమజ్జనోత్సవాల వేళ విషాదకర ఘటన జరిగింది. ట్యాంక్ బండ్ ఎన్టీఆర్ మార్గ్ లో నిమజ్జనం విధుల్లో ఉన్న కొత్తగూడెం టూ టౌన్ పోలీస్ స్టేషన్ ఎస్సై కె.వెంకన్నను గుర్తు తెలియని స్కూటీ ఢీకొట్టి ఆగకుండా వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఆయన ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందారు. గణేష్ నిమజ్జన బందోబస్తు కోసం కొత్తగూడెం నుంచి హైదరాబాద్ కు పంపించారు. ఈ క్రమంలోనే ఎన్టీఆర్ మార్గ్ క్రేన్ నంబర్ 2 సమీపంలో ఎస్సై వెంకన్న విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ క్రమంలో బుధవారం తెల్లవారుజామున గుర్తుతెలియని ద్విచక్ర వాహనం ఆయనను ఢీకొట్టినట్లు పోలీసులు తెలిపారు. ఎస్సై వెంకన్నకు గాయాలు కావడంతో సహచర పోలీసులు వెంటనే వైద్య సహాయం అందించారు. ప్రమాదం తొలుత పెద్దగా అనిపించకపోయినా ఆ తర్వాత ఆయనకు అస్వస్థత, తల తిరగడం వంటి సమస్యలు తలెత్తడంతో వరంగల్ లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆయన మృతిచెందారు.

**ఎస్ఐ వెంకన్న మృతి బాధాకరం : సీఎం రేవంత్ రెడ్డి**

గణేష్ నిమజ్జనం బందోబస్తు విధుల్లో ఉన్న కొత్తగూడెం టూటౌన్ ఎస్ఐ కె.వెంకన్న గుర్తుతెలియని వాహనం ఢీకొన్న దుర్ఘటనలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ మృతిచెందడం పట్ల ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. శాంతి భద్రతల పరిరక్షణలో అంకితభావంతో విధులు నిర్వర్తిస్తూ ఆయన ప్రాణాలు కోల్పోవడం అత్యంత విషాదకరమని పేర్కొన్నారు. వెంకన్న మరణం ఆయన కుటుంబానికే కాక రాష్ట్ర పోలీసు శాఖ మొత్తానికి తీరని లోటని సీఎం ఆవేదన వ్యక్తం చేశారు. వెంకన్న పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తూ ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఎస్ఐ వెంకన్న కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని, అండగా నిలబడుతుందని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. బాధ్యతారాహిత్యంగా వాహనం నడిపి ఈ ప్రమాదానికి కారణమైన నిందితుడిని వెంటనే గుర్తించి చట్టపరంగా అత్యంత కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను ముఖ్యమంత్రి స్పష్టంగా ఆదేశించారు.

# 2030 నాటికి పేదరిక రహిత రాష్ట్రంగా తెలంగాణ

**మొదటిపేజీ తరువాయి**

పర్యవేక్షించేలా వ్యవస్థలను రూపొందించడంపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు.

**టీఎస్‌డీపీఎస్‌కు ప్రత్యేక పీఎంయూ**

రాష్ట్ర అభివృద్ధి ప్రణాళికా సంఘం(టీఎస్‌డీపీఎస్)ను మరింత బలోపేతం చేయాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా ప్రత్యేక ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ యూనిట్ (పీఎంయూ) ఏర్పాటు చేయనున్నారు. రాష్ట్ర ప్రాధాన్యతా అభివృద్ధి కార్యక్రమాలకు వ్యూహాత్మక ప్రణాళిక రూపొందించడం, వివిధ శాఖల మధ్య సమన్వయం, కార్యక్రమాల అమలు, పర్యవేక్షణ, పురోగతిని వేగవంతం చేయడం వంటి బాధ్యతలను పీఎంయూ నిర్వహించనుంది.

**2030 నాటికి 'జీరో పావర్టీ'**

2030 నాటికి తెలంగాణను 'జీరో పావర్టీ' రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక, లక్షిత కార్యక్రమాలను అమలు చేయనున్నారు. పేదరికానికి గురయ్యే కుటుంబాలను గుర్తించి వారికి అందాల్సిన వివిధ ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలను సమన్వయంతో అమలు చేయడంతోపాటు స్థిరమైన జీవనోపాధి కల్పించే దిశగా చర్యలు చేపట్టనున్నారు. పేదరిక నిర్మూలన కార్యక్రమాల ఫలితాలను కొలిచేందుకు, పర్యవేక్షించేందుకు ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.

**2033 నాటికి అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థ**

తెలంగాణను 2033 నాటికి అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థ కలిగిన రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు వేగవంతమైన, కేంద్రీకృత అభివృద్ధి వ్యూహాన్ని రూపొందించనున్నారు. రాష్ట్రంలోని బలాలను మరింత సమర్థవంతంగా వినియోగించుకోవడంతోపాటు పెట్టుబడులు, ఆవిష్కరణలు, ఉపాధి అవకాశాలు, సమ్మిళిత అభివృద్ధికి కొత్త అవకాశాలను అందిపుచ్చుకునేలా కార్యాచరణ రూపొందించనున్నారు. ప్రభుత్వ సంస్థాగత సామర్థ్యాన్ని పెంచేందుకు వివిధ రంగాల్లో ప్రత్యేక పరిజ్ఞానం కలిగిన నిపుణులు, కన్సల్టెంట్ల సేవలను వినియోగించుకోవాలని నిర్ణయించారు. ఆర్థిక అభివృద్ధిని వేగవంతం చేసేందుకు అవసరమైన సాంకేతిక, వ్యూహాత్మక సహకారాన్ని నిపుణుల ద్వారా పొందనున్నారు.

**ప్రభుత్వం-జీఎఫ్ఎస్‌టీ భాగస్వామ్యం**

వ్యూహాత్మక ప్రణాళిక, డేటా ఆధారిత నిర్ణయాలు, సాంకేతిక పరిజ్ఞానం, నాలెడ్జ్ సపోర్ట్, సామర్థ్య నిర్మాణం, పర్యవేక్షణ, కీలక అభివృద్ధి కార్యక్రమాల వేగవంతమైన అమలుకు రాష్ట్ర ప్రభుత్వంజీఎఫ్ఎస్‌టీ మధ్య అవగాహన ఒప్పందం కుదుర్చుకునే ప్రతిపాదనను సిద్ధం చేయాలని నిర్ణయించారు. రాష్ట్రస్థాయి అభివృద్ధి లక్ష్యాలను జిల్లాల స్థాయిలో కొలిచే వీలున్న ఫలితాలుగా మార్చేందుకు సమగ్ర జిల్లా అభివృద్ధి ప్రణాళికలను రూపొందించాలని ఉప ముఖ్యమంత్రి సూచించారు. ఈ ప్రణాళికలకు డేటా ఆధారిత డ్యాష్‌బోర్డులు, స్పష్టమైన కీ పెర్ఫార్మెన్స్ ఇండికేటర్స్, కొలిచే వీలున్న ఫలితాలు, బడ్జెట్ అనుసంధానం ఉండేలా చర్యలు తీసుకోనున్నారు. దీంతో జిల్లాల అభివృద్ధి పురోగతిని నిరంతరం పర్యవేక్షించడంతోపాటు లోటుపాట్లను గుర్తించి, అవసరమైనచోట సకాలంలో దిద్దుబాటు చర్యలు చేపట్టే అవకాశం ఉంటుంది.

**ఏడు సెక్టోరల్ గ్రోత్ ల్యాబ్స్**

ప్రభుత్వ శాఖలు, రంగాల నిపుణులు, పరిశ్రమలు, విద్యా సంస్థలు, అభివృద్ధి సంస్థలు, ఇతర కీలక భాగస్వాములను ఒకే వేదికపైకి తీసుకురావడానికి ఏడు సెక్టోరల్ గ్రోత్ ల్యాబ్‌స్‌ను ఏర్పాటు చేయనున్నారు. ఈ గ్రోత్ ల్యాబ్‌స్‌లో ప్రధానంగా పేదరిక నిర్మూలన, మౌలిక వసతులులాజిస్టిక్స్, ఆరోగ్యం, పర్యాటకం, పశు సంపద ఆక్వా కల్చర్, పట్టణీకరణ, అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థ అంశాలపై దృష్టి సారించనున్నారు. అభివృద్ధి అవకాశాలను గుర్తించడం, అమలులో ఉన్న అవరోధాలను పరిష్కరించడం, రంగాల వారీ వ్యూహాలను రూపొందించడం, ప్రాధాన్యతలను కాలపరిమితితో కూడిన, కొలిచే వీలున్న కార్యాచరణ ప్రణాళికలుగా మార్చడం గ్రోత్ ల్యాబ్స్ ప్రధాన ఉద్దేశంగా ఉంటుంది.

**ఫలితాల ఆధారంగా అభివృద్ధి**

టీఎస్‌డీపీఎస్‌పీఎంయూ బలోపేతం, జిల్లా అభివృద్ధి ప్రణాళికలు, ఏడు సెక్టోరల్ గ్రోత్ ల్యాబ్స్, రంగాల నిపుణుల సేవలు, ప్రభుత్వంజీఎఫ్ఎస్‌టీ భాగస్వామ్యం ద్వారా రాష్ట్ర అభివృద్ధికి సమగ్ర సంస్థాగత వ్యవస్థను ఏర్పాటు చేయనున్నారు. డేటా ఆధారిత నిర్ణయాలు, ఫలితాలపై దృష్టి, మిషన్ మోడ్‌లో అభివృద్ధి కార్యక్రమాల అమలుకు ఈ వ్యవస్థ దోహదపడనుంది. 2030 నాటికి పేదరిక నిర్మూలన, 2033నాటికి అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థ లక్ష్యాలను వేగంగా సాధించేందుకు రాష్ట్ర అభివృద్ధి దార్శనికతను కార్యాచరణలోకి తీసుకురావడమే ఈ నిర్ణయాల ప్రధాన ఉద్దేశమని సమావేశంలో స్పష్టం చేశారు. సమావేశంలో ఫైనాన్స్ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా, ఆర్థిక ప్రణాళిక శాఖ కార్యదర్శి గౌరవ్ ఉప్పల్ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# గ్రామ హద్దులు చూపిన తర్వాతే నోటీసులివ్వాలి

**మర్కుక్, సెప్టెంబర్ 24 :**

మర్కూక్ మండలం ఎర్రవల్లి గ్రామం 325 సర్వే నంబర్ వివాదం ఇప్పుడు శివారు వెంకటాపూర్ గ్రామానికి పాకి తీవ్ర కలకలం రేపుతోంది. శివారు వెంకటాపూర్ గ్రామానికి చెందిన 41,85,88,77,100 సర్వే నెంబర్లకు సంబంధించి జీపీవో అధికారి నోటీసులు ఇవ్వబోగా గ్రామానికి చెందిన 42 మంది రైతులు తిరస్కరించారు. దీంతో చేసేది లేక జీపీవో అధికారి నోటీసులను తిరిగి వెంట తీసుకెళ్లారు. గ్రామస్తులు మాట్లాడుతూ తమకు ప్రభుత్వం అధికారికంగా ధరణి పాస్ పుస్తకాలు, పూర్వపు ఇందిరమ్మ పట్టాలు 41,85,88 సర్వే నంబర్ల పేరుతో ఇచ్చింది. తాము దశాబ్దాలుగా అందులోనే సాగు చేసుకుంటున్నాం.. కానీ అప్పుడు ప్రభుత్వ అధికారులు 2017లో పలు సర్వే నంబర్లతో కూడిన తమ భూములను ఎర్రవల్లికి చెందిన 325 సర్వే నంబర్ లో కలిపేసారని, మళ్లీ ఇప్పుడు నోటీసులు ఇచ్చి కొలవడానికి వస్తున్నారు.. ఇది ఎక్కడి న్యాయమంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ముందు 2017 నాటి హద్దులను తమ గ్రామానికి చూపించి ఆ తరువాతనే తమకు నోటీసులు ఇచ్చి సర్వేకు రావాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. సర్వే నంబర్లను శివారు వెంకటాపూర్ గ్రామంలో కలపకుండా ఎర్రవల్లి 325లో కలపడం వల్ల కొందరు రైతులకు తమ సొంత గ్రామం పేరు మీదనే భూమి లేకుండా పోయిందని ఆరోపించారు. 41,85,88,77, 100 సర్వే నంబర్ భూమిని తీసుకెళ్లి 325 లో కలపడం వల్ల గ్రామంలో తాము భూమి లేని వాళ్లం అయిపోతున్నాం అని మాట్లాడారు. పాస్ పుస్తకాలు చేతిలో ఉన్నా సర్వేల పేరుతో తమ భూములు లాక్కుంటే ఎలా? ముందు గ్రామానికి చెందిన సర్వే నెంబర్ల హద్దులు నిర్ధారించాలి.. గతంలో ఉన్న విధంగా తమ శివారు భూములను తమకు చూపించిన తర్వాతే నోటీసులు ఇవ్వాలని, అప్పుడే కొలతలకు సహకరిస్తాం అని జీపీవోకు, సర్వేయర్లకు స్పష్టం చేశారు. దీంతో శివారు వెంకటాపూర్ గ్రామంలో ఉద్రిక్తత నెలకొంది. సీఎం రేవంత్ రెడ్డి, జిల్లా కలెక్టర్ హైమవతి వెంటనే స్పందించి రికార్డుల ప్రకారం న్యాయంగా సర్వే చేయించి తమకు న్యాయం చేయాలని రైతులు వేడుకున్నారు.

# గణేష్ నిమజ్జనానికి ఆర్టీసీ భారీ ఏర్పాట్లు

**హైదరాబాద్, సెప్టెంబర్ 24 :**

రాష్ట్ర రాజధానిలో గణేష్ నిమజ్జన వేడుకల సందర్భంగా భక్తులకు, ప్రయాణికులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా టీజీఎస్ ఆర్టీసీ ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టింది. నిమజ్జన కార్యక్రమం పూర్తయ్యే వరకు నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి హుస్సేన్సాగర్ పరిసర ప్రాంతాలకు, అక్కడి నుంచి తిరిగి వివిధ రూట్లకు 700 ప్రత్యేక బస్సులను అందుబాటులో ఉంచింది. గణేష్ నిమజ్జనం సందర్భంగా భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని 24 గంటల పాటు ప్రత్యేక బస్సులను నడపనున్నట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. హుస్సేన్సాగర్ పరిసర ప్రాంతాల నుంచి నగరంలోని ప్రధాన ప్రాంతాలకు నిరంతరాయంగా బస్సు సౌకర్యం కల్పించనున్నారు. ట్రాఫిక్ మళ్లింపులు, ప్రయాణికుల రద్దీని సమన్వయం చేసేందుకు 44 కీలక ప్రాంతాల్లో ఆర్టీసీ అధికారులు, కంట్రోలర్లను నియమించారు. అలాగే ప్రయాణికుల పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు జోనల్ కార్యాలయంలో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. నిమజ్జన సమయంలో అత్యవసర సహాయం అందించేందుకు ఓల్డ్ ఎమ్మెల్యే క్వార్టర్స్, ఇందిరా పార్క్, వి.వి.విగ్రహం వద్ద ఆర్టీసీ రిలీఫ్ వాహనాలను సిద్ధంగా ఉంచారు. ఖైరతాబాద్, లక్డీకాపూల్, కోటి, బషీర్ బాగ్, ఇందిరా పార్క్, ఏఐఆర్ ప్రాంతాల్లో ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేశారు. బస్సుల్లో ఎలాంటి సాంకేతిక సమస్యలు తలెత్తినా వెంటనే పరిష్కరించేందుకు పోలీస్ స్టేషన్ల వద్ద 113 మంది డ్రైవర్లు. 87 మంది మెకానిక్‌ను అందుబాటులో ఉంచారు. ట్రాఫిక్ పోలీసుల సూచనల మేరకు సిటీ బస్సులతో పాటు అంతర్రాష్ట్ర సర్వీసులు అయిన ఏపీఎస్ఆర్టీసీ, కేఎస్ ఆర్టీసీ బస్సుల రూట్లలోనూ అవసరమైన మార్పులు చేయనున్నట్లు అధికారులు వెల్లడించారు. నిమజ్జనం శనివారం ఉదయం వరకు కొనసాగినప్పటికీ ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యామ్నాయ ప్రణాళికలతో టీజీఎస్ ఆర్టీసీ సిద్ధంగా ఉందని అధికారులు తెలిపారు.

**అర్ధరాత్రి వరకు మెట్రో సేవలు**

గణేష్ నిమజ్జన శోభాయాత్రకు తరలివచ్చే వేలాదిమంది భక్తుల సౌకర్యార్థం హైదరాబాద్ మెట్రో రైలు యాజమాన్యం కీలక నిర్ణయం తీసుకుంది.



గణేష్ విగ్రహాల నిమజ్జనోత్సవాన్ని పురస్కరించుకుని మెట్రో రైలు సర్వీసుల వేళలను పొడిగించినట్లు అధికారులు వెల్లడించారు. 25వ తేదీన ప్రారంభమయ్యే మెట్రో సర్వీసులు అర్ధరాత్రి దాటాక 26న తెల్లవారు జామున 1 గంట వరకు అందుబాటులో ఉంటాయని స్పష్టం చేశారు.

# డీఎస్పీ భీమ్‌రెడ్డి బినామీల ఇళ్లల్లో సోదాలు

**హైదరాబాద్, సెప్టెంబర్ 24:**

అక్రమ ఆస్తుల కేసులో అరెస్టు అయిన డీఎస్పీ సంకిరెడ్డి భీమ్‌రెడ్డికి బినామీలుగా అనుమానిస్తున్న ఎనిమిదిమంది ఇళ్లల్లో అవినీతి నిరోధక శాఖ అధికారులు గురువారం ఏకకాలంలో సోదాలు నిర్వహించారు. హైదరాబాద్, జహీరాబాద్ పది ప్రాంతాల్లో ఈ సోదాలు చేసినట్లు ఏసీబీ అధికారులు వెల్లడించారు. భీమ్‌రెడ్డితో ఆర్థిక, ఇతర లావాదేవీలు ఉన్నట్లు అనుమానిస్తున్న వారి ఇళ్ల నుంచి పలు కీలక పత్రాలు, ఇతర ఆధారాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. బొమ్మ వెంకటేష్ అనే వ్యక్తి ఇంట్లో తనిఖీలు చేయగా రూ.1.35 కోట్ల అక్రమ నగదును గుర్తించామని వారు తెలిపారు. అంతేకాక భారీగా విదేశీ కరెన్సీని, సుమారు 14 లీటర్ల విదేశీ మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఏసీబీ అధికారులు వెల్లడించారు. అక్రమ మద్యం విషయాన్ని ఎక్సైజ్ శాఖకు తెలియజేశామని, ఎక్సైజ్ చట్టాల ప్రకారం సంబంధిత పోలీసులు కేసు నమోదు చేస్తారని తెలిపారు. భీమ్ రెడ్డి డీజీపీ కార్యాలయంలోని పోలీస్ కంప్యూటర్ సర్వీసెస్ విభాగంలో పనిచేశారు. తెలంగాణ, కర్ణాటక వ్యాప్తంగా 16 ప్రాంతాలలో జరిగిన సోదాలలో రూ.200 కోట్లకు పైగా విలువైన స్థిరాస్తులు, చరాస్తులు బయట పడటంతో జూలైలో ఆయనను అరెస్టు చేసి చంచగూడ జైలుకు తరలించారు.

# క్షుద్రపూజల ఆరోపణలపై పరువు నష్టం కేసు

**హైదరాబాద్, సెప్టెంబర్ 24:**

క్షుద్ర పూజలు చేసినట్లు మహేష్ కుమార్ గౌడ్, అద్దంకి దయాకర్ చేస్తున్న అసత్య ప్రచారంపై లీగల్ గా ముందుకు వెళ్తున్నామని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీష్ హరీష్ రావు వెల్లడించారు. ఆధారాలతో పరువు నష్టం కేసు దాఖలు చేశామని, కోర్టు పిటీషన్ స్వీకరించిందని, వచ్చే బుధవారం స్టేట్మెంట్స్ రికార్డు చేస్తం అని చెప్పారన్నారు. దేవుళ్ల దగ్గరకు వెళ్తే కూడా క్షుద్ర పూజలు అంటూ పిచ్చిపిచ్చిగా మాట్లాడుతున్నారని హరీష్ రావు గురువారం నాంపల్లి ప్రజా ప్రతినిధుల కోర్టు వద్ద మీడియాతో మాట్లాడుతూ ఆరోపించారు. ఇంతకంటే దిగజారుడు రాజకీయాలు ఉండవన్నారు. తమపై చిల్లరగా ఆరోపణలు చేస్తే వాళ్లలాగా స్థాయి దిగజారి మాట్లాడమన్నారు. 'వాళ్లు బురదలో ఉన్నరు.. మాకు బురద అంటించే ప్రయత్నం చేస్తున్నరు.. ప్రజల సమస్యల గురించి మాట్లాడితే కేసులు పెడుతున్నరు.. మేనిఫెస్టో హామీలు ఏమైనవి అని అడిగితే లేనిపోని నిందలు వేస్తున్నార'న్నారు. శాసనసభలో కూడా అనేక అబద్ధాలు మాట్లాడుతున్నారని ఆరోపించారు. వీటిపై స్పీకర్ కి నోటీసులు కూడా ఇచ్చామని గుర్తు చేశారు. ప్రివిలేజెస్ కమిటీ చైర్మన్ గా డిప్యూటీ స్పీకర్ ఉంటారు.. వారు ఇలాంటి ఫిర్యాదులను పరిశీలించి చర్యలు తీసుకుంటారు.. కానీ మూడేళ్లు అయినా నియామకం జరగలేదు.. ఎన్నిసార్లు సభా హక్కుల ఉల్లంఘన నోటీసులు ఇచ్చినా స్పీకర్ పట్టించుకోవడం లేదు.. మూడేళ్ల నుంచి డైవర్షన్ డ్రామా తప్ప కాంగ్రెస్ పాలనలో చేసిందేం లేదు అని వ్యాఖ్యానించారు. ప్రతిపక్షాలను టార్గెట్ చేయడమే తప్ప ప్రజల గురించి పట్టించుకోవడం లేదని, మాటలతో కాలం గడుపుతున్నారని విమర్శించారు. రాష్ట్రం తిరోగమన దిశలో పయనిస్తున్నదని, నీళ్ల కష్టాలు, కరెంట్ కష్టాలు రాష్ట్రాన్ని చుట్టుముట్టినా ఈ ప్రభుత్వానికి పట్టింపులేదన్నారు. ఎల్నినో పేరు చెప్పి చేతులు ముడుచుకు కూర్చుంటున్నరు.. ప్రతిపక్షంగా ప్రభుత్వాన్ని నిలదీస్తే సహించలేకపోతున్నరు అని అన్నారు. ఎవరెన్ని అన్నా, ఎన్ని కేసులు పెట్టినా తమకు న్యాయస్థానాల మీద నమ్మకం ఉందని చెప్పారు. గోబెల్స్ ప్రచారం చేస్తే వదిలిపెట్టం.. ఎంతటి వారినైనా వదలం.. ఎంత దూరం అయినా పోతాం. వారికి శిక్ష పడేదాక వదిలిపెట్టబోమని స్పష్టం చేశారు. దానం నాగేందర్ అనర్హతకు సంబంధించి సుప్రీం కోర్టు గట్టి తీర్పు ఇచ్చిందన్నారు. న్యాయస్థానం తీర్పు రేవంత్ కు చెంపపెట్టు అన్నారు. పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహిస్తూ రాజ్యాంగ విలువలను కాలరాస్తున్న రేవంత్ కు ఇది గట్టి గుణపాఠం అవుతుందన్నారు. అధికారంలో చేతిలో ఉంది కదా అని ఇష్టం ఉన్నట్లు ప్రవర్తిస్తే కోర్టులు చూస్తూ ఊరుకోవన్నారు. రేవంత్ రెడ్డి అధికారాన్ని అడ్డుపెట్టుకొని రాజ్యాంగ విలువలను కాలరాస్తుంటే ప్రతిపక్షాలను వేధిస్తుంటే న్యాయస్థానాలు గట్టి బుద్ధి చెబుతున్నాయన్నారు. న్యాయవ్యవస్థలపై ప్రజల విశ్వాసాన్ని మరింత పెంచేలా వస్తున్న తీర్పులను స్వాగతిస్తున్నామన్నారు. దానం ఒక్కరే కాదు పార్టీ మారిన మిగతా ఎమ్మెల్యేలతో కూడా రాజీనామా చేయించి ప్రజాక్షేత్రంలోకి రండి అని పిలుపునిచ్చారు. చేతిలో రాజ్యాంగాన్ని పట్టుకొని దేశమంతా తిరిగే రాహుల్ గాంధీకి తెలంగాణ జరుగుతున్న రాజ్యాంగ హననం కనిపించడం లేదా.. కండువాలు కప్పి పార్టీలో చేర్చుకుంటే కనిపించడం లేదా.. మీ మాటల్లో నిజాయతీ లేదా.. పార్టీ ఫిరాయింపుల చట్టాన్ని కాంగ్రెస్ తెచ్చింది అని చెప్పుకునే రాహుల్ గాంధీ మరి ఎందుకు ఆ చట్టాన్ని తుంగలో తొక్కుతున్నారు అని ప్రశ్నించారు. రాజ్యాంగం మీద మీకు నిజంగా గౌరవం ఉంటే,వెంటనే పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించండి అని డిమాండ్ చేశారు.

# ఉప ఎన్నికకు సిద్ధం

- సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తున్నా: దానం నాగేందర్
- చట్టపరంగా ప్రయత్నించడంలో తప్పులేదని వ్యాఖ్య
- ఎన్నికలు ఎప్పుడొచ్చినా ప్రజల్లోకి వెళ్తానని స్పష్టీకరణ
- ఏ పార్టీ నుంచి పోటీ చేసేదీ షెడ్యూల్ తర్వాత చెబుతానన్న మాజీ ఎమ్మెల్యే
- జూబ్లీహిల్స్ ఫలితమే ఖైరతాబాద్‌లో పునరావృతమవుతుందని ధీమా





హైదరాబాద్, సెప్టెంబరు 24:

ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానానికి ఉప ఎన్నిక ఎప్పుడు వచ్చినా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నానని మాజీ ఎమ్మెల్యే దానం నాగేందర్ ప్రకటించారు. తన అనర్హతపై తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసిన నేపథ్యంలో ఆయన స్పందించారు. సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తున్నానని, చట్టపరంగా ప్రయత్నించడంలో తప్పేమీ లేదని పేర్కొన్నారు. అందులో భాగంగానే న్యాయపోరాటం చేసినట్లు తెలిపారు.

**ఏ పార్టీ అనేది షెడ్యూల్ తర్వాతే**

మళ్లీ ఎన్నికలకు వెళ్లాలని సుప్రీంకోర్టు చెప్పిందని, ఎన్నికలు ఎప్పుడు వచ్చినా ప్రజల మధ్యకు వెళ్తానని దానం నాగేందర్ తెలిపారు. తాను నిరంతరం ప్రజల్లోనే ఉంటున్నానని, ఇకపైనా ప్రజాక్షేత్రంలోనే రాజకీయ ప్రయాణం కొనసాగిస్తానన్నారు. ఖైరతాబాద్ ఉప ఎన్నికలో ఏ పార్టీ నుంచి పోటీ చేస్తారన్న ప్రశ్నకు ఎన్నికల షెడ్యూల్ వచ్చిన తర్వాతే స్పష్టత ఇస్తానని చెప్పారు. అప్పటి పరిస్థితుల్లో ఎంపీగా పోటీ చేశానని, ఇప్పుడు కూడా ఎన్నికలను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నానన్నారు.

**బీఆర్ఎస్‌పై వ్యాఖ్యలు చేయను**

బీఆర్ఎస్‌పై ప్రస్తుతం ఎలాంటి వ్యాఖ్యలు చేయబోనని దానం చెప్పారు. ఖైరతాబాద్ ప్రజలకు ఎవరు అండగా ఉన్నారో తెలుసన్నారు. గెలిచినా, ఓడినా నియోజకవర్గ ప్రజలు తనతోనే ఉన్నారని పేర్కొన్నారు. గతంలో ఉప ఎన్నికలో ఓడిపోయినా ఆ తర్వాత రాజకీయంగా ప్రమోషన్ వచ్చిందని గుర్తుచేశారు. తాను ఖైరతాబాద్‌లోనే ఉండాలని, ఢిల్లీకి వెళ్లొద్దనే ఉద్దేశంతో ఎంపీ ఎన్నికల్లో ఓడించారని వ్యాఖ్యానించారు. తాను ఎంపీగా పోటీ చేసినప్పుడు కిషన్‌రెడ్డి భయపడ్డారా లేదా అన్నది ప్రజలకే తెలుసన్నారు. ఖైరతాబాద్ ఉప ఎన్నికలో జూబ్లీహిల్స్ ఫలితమే పునరావృతమవుతుందని దానం నాగేందర్ వ్యాఖ్యానించారు.

# సుప్రీం కోర్టు తీర్పును స్వాగతిస్తున్నాం

దుబాయి, సెప్టెంబర్ 24 :

ఎమ్మెల్యే దానం నాగేందర్‌పై అనర్హత వేటు వేస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు సమర్థించడాన్ని స్వాగతిస్తున్నామని, ఇది ముమ్మాటికీ ప్రజాస్వామ్యానికి, రాజ్యాంగ నైతికతకు దక్కిన చారిత్రక విజయం అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. సత్యమేవ జయతే ప్రజాస్వామ్యంలో ఎంతటివారైనా రాజ్యాంగానికి తలవంచాల్సిందేనని, అంతిమంగా సత్యమే గెలుస్తుందని సుప్రీంకోర్టు తీర్పుతో మరోసారి రుజువైందన్నారు. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించేందుకు తమ శాసనసభా పక్షం చేసిన రాజీ లేని న్యాయ పోరాటం వల్లే ఈ అద్భుత విజయం సాధ్యమైందన్నారు. చట్టసభలు ఆయారాం, గయారాంలకు అడ్డా కాకూడదని, ఘర్ వాపసీల పేరుతో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయలేరని సర్వోన్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పు కాంగ్రెస్ అహంకారానికి గట్టి చెంపపెట్టు అని పేర్కొన్నారు. ఇదే స్ఫూర్తితో కాంగ్రెస్ ప్రభుత్వం సాగిస్తున్న రాజ్యాంగ వ్యతిరేక చర్యలపై కోర్టుల్లో న్యాయపోరాటాన్ని, క్షేత్రస్థాయిలో ప్రజా పోరాటాలను మరింత ఉధృతంగా ముందుకు తీసుకెళ్తామని ఆయన స్పష్టం చేశారు. ఫిరాయింపుల నిరోధక చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాల్సిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా ఫిరాయింపులను ప్రోత్సహించడం కంచే చేను మేసిన వైనాన్ని తలపించిందని ఎద్దేవా చేశారు. న్యాయం ముందు ఎవరూ తప్పించుకోలేరని తేలిపోయిందన్నారు. రాజ్యాంగ ద్రోహానికి పాల్పడిన సీఎం రేవంత్ రెడ్డి ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకుని కాంగ్రెస్ కండువా కప్పుకున్న ఫిరాయింపు ఎమ్మెల్యేలందరితో తక్షణమే రాజీనామాలు చేయించి ఉప ఎన్నికలకు వెళ్లాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. రాజ్యాంగ ప్రతి పట్టుకుని దేశమంతా తిరుగుతూ సంవిధాన్ బచావో అని నాటకాలాడుతున్న రాహుల్ గాంధీ మరో పార్టీ బీఫాంతో గెలిచిన ఎమ్మెల్యేకు కాంగ్రెస్ ఎంపీ టికెట్ ఇచ్చి పోటీ చేయించడం ఆయన నయవంచనకు, కపట రాజకీయాలకు నిలువెత్తు నిదర్శనమని రామచందర్‌రావు మండిపడ్డారు.

**ఆ తీర్పు కాంగ్రెస్‌కు చెంపపెట్టు**

**– బీఆర్ ఎస్ నేత హరీశ్ రావు**

ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అనర్హతను సమర్థిస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు రాజ్యాంగ పరిరక్షణ గురించి పదేపదే మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ ద్వంద్వ వైఖరిని ప్రశ్నిస్తోందని బీఆర్ ఎస్ నేత టి.హరీష్‌రావు అన్నారు. రాహుల్ గాంధీ దేశవ్యాప్తంగా సంవిధాన్ బచావో అంటూ రాజ్యాంగ పరిరక్షణ గురించి మాట్లాడుతున్నారు.. ఇప్పుడు ఆ మాటలను ఆచరణలో చూపించాల్సిన సమయం వచ్చిందని ఆయన అన్నారు. రాజ్యాంగంపై రాహుల్ గాంధీకి నిజమైన నిబద్ధత ఉంటే కాంగ్రెస్‌లోకి పార్టీ ఫిరాయించిన మిగతా ఎమ్మెల్యేలతో కూడా రాజీనామా చేయించి ప్రజల తీర్పు కోరాలని ఆయన డిమాండ్ చేయాలన్నారు. దిల్లీలో రాజ్యాంగ నైతికత గురించి మాట్లాడుతున్న రాహుల్ తెలంగాణలో తమ పార్టీ అనుసరిస్తున్న ఫిరాయింపుల రాజకీయాలపై ఎందుకు మౌనం వహిస్తున్నారని ప్రశ్నించారు. సంవిధాన్ బచావో అనేది కేవలం రాజకీయ నినాదమా.. లేక నిజమైన రాజ్యాంగ నిబద్ధతా అనేది రాహుల్ గాంధీ స్పష్టం చేయాలన్నారు. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించి తిరిగి ప్రజాక్షేత్రంలోకి పంపాలని హరీష్‌రావు డిమాండ్ చేశారు.

## దానంపై అనర్హత వేటు ప్రజాస్వామ్య విజయం

- బీజేపీ ఎంపీ అరుణ

హైదరాబాద్, సెప్టెంబర్ 24 :



ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ సభ్యత్వాన్ని రద్దు చేస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పును సమర్థిస్తూ సుప్రీంకోర్టు వెలువరించిన నిర్ణయం ప్రజాస్వామ్య విజయమని ఎంపీ, బీజేపీ తమిళనాడు సహ ఇన్‌చార్జి డీకే అరుణ పేర్కొన్నారు. రాజ్యాంగాన్ని అపహాస్యం చేస్తూ కాంగ్రెస్, బీఆరఎస్ పార్టీలు సాగించిన అనైతిక రాజకీయాలకు ఈ తీర్పు చెంపపెట్టు అన్నారు. రాజీనామా చేయకుండా వ్యక్తిగత, స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం అధికార కాంగ్రెస్‌లో చేరి ఎంపీగా పోటీ చేయడం తీవ్రమైన రాజ్యాంగ ఉల్లంఘన అని, ఇది దిగజారుడు, దివాలాకోరు రాజకీయాలకు నిదర్శనమని మండిపడ్డారు. ప్రజాస్వామ్య విలువలను కాలరాస్తూ పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించడం దుర్మార్గమన్నారు. హుందా రాజకీయాలకు పాతరేసి రాజకీయ విలువలను నీరుగార్చడం అత్యంత శోచనీయమన్నారు. ఫిరాయింపును హైకోర్టు తప్పుబట్టినప్పటికీ సిగ్గు లేకుండా సుప్రీం కోర్టును ఆశ్రయించడం కాంగ్రెస్ పార్టీ దిగజారుడుతనానికి నిదర్శనమన్నారు. ఒక చేత రాజ్యాంగం పట్టుకుని, మరో చేతితో పార్టీ ఫిరాయింపులకు పాల్పడుతున్న కాంగ్రెస్ జాతీయ నాయకత్వ ద్వంద్వ నీతికి అద్దంపడుతోందని, సుప్రీం తీర్పుతో రాహుల్ గాంధీ సిగ్గుపడాలని అన్నారు. ప్రజల ఓట్లకు విలువ లేకుండా కుటిల రాజకీయ క్రీడకు తెరలేపిన ఆ పార్టీలకు ఖైరతాబాద్ ప్రజలు ఉప ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పడం ఖాయమని అన్నారు. ఇప్పటికైనా పార్టీ ఫిరాయించిన పదిమంది ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించాలని అరుణ కాంగ్రెస్ పార్టీని డిమాండ్ చేశారు.

## రోడ్డు ప్రమాదాల నివారణకు కీలక నిర్ణయం

- టీజీ-టీమార్స్' ఏర్పాటు
- జీవో 135 విడుదల చేసిన సీఎస్

హైదరాబాద్, సెప్టెంబర్ 24 :



రాష్ట్రంలో నిత్యం వేధిస్తున్న ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడంతోపాటు రోడ్డు ప్రమాదాలను అరికట్టేందుకు సీఎం రేవంత్ రెడ్డి కీలక నిర్ణయం తీసుకున్నారు. ట్రాఫిక్ నిర్వహణ అంటే కేవలం చలానాలు వసూలు చేయడమే కాకుండా శాస్త్రీయ పద్ధతుల్లో ట్రాఫిక్‌ను నియంత్రించడం, అత్యవసర వైద్య సాయం అందించడమే లక్ష్యంగా తెలంగాణ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్, రోడ్ అండ్ రైల్ సేఫ్టీ బ్యూరో (టీజీటీమార్స్)ను ఏర్పాటు చేశారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు గురువారం అందుకు సంబంధించిన జీవో 135 విడుదల చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన నడిచే రాష్ట్ర రోడ్డు భద్రతా మండలి పరిధిలోనే ఈ కొత్త వ్యవస్థ పనిచేస్తుంది. ఈ ప్రత్యేక విభాగం అదనపు డీజీపీ లేదా ఐజీపీ స్థాయి అధికారి నేతృత్వంలో హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తుంది. రాష్ట్రంలోని 32 వేల కిలోమీటర్ల కంటే ఎక్కువ ఉన్న రహదారులు, 1.8 కోట్లకు పైగా ఉన్న వాహనాల రాకపోకలను ఈ బ్యూరో పర్యవేక్షిస్తుంది. రోడ్డు రవాణాతోపాటు మెట్రో, రైల్వే భద్రతను కూడా ఈ విభాగానికే అప్పగించారు. బాధితుల ప్రాణాలు కాపాడేందుకు ప్రతీ పోలీస్ స్టేషన్‌లో 24 గంటలూ అందుబాటులో ఉండేలా ఒక రోడ్ యాక్సిడెంట్ రెస్పాన్స్ ఆఫీసర్‌ను నియమిస్తారు. ప్రమాదం జరిగిన వెంటనే క్షతగాత్రులను గోల్డెన్ అవర్‌లో హాస్పిటల్‌కు తరలించడం వీరి బాధ్యత. అలాగే ఔటర్ రింగ్ రోడ్డు, 50 కి.మీ కంటే ఎక్కువ ఉన్న హైవేలపై స్పీడ్ డిటెక్టర్లు, అత్యాధునిక కెమెరాలతో కూడిన హైవే పెట్రోలింగ్ యూనిట్లు నిరంతరం పహారా కాస్తారు. ఈ వ్యవస్థ నిర్వహణ కోసం ప్రత్యేకంగా ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ ఫండ్‌ను ఏర్పాటు చేశారు. పోలీసులకు వచ్చే ట్రాఫిక్ జరిమానాల మొత్తంలో 40% ఈ నిధికే మళ్లిస్తారు. ఈ నిధులను సిబ్బంది శిక్షణ, అధునాతన సాంకేతికత, పెట్రోలింగ్ వాహనాలు, అత్యవసర రోడ్డు మరమ్మతుల కోసమే ఉపయోగిస్తారు.

# నేడు సీఎం రేవంత్‌కు 'ముహమ్మద్' అవార్డు ప్రదానం

- బెస్ట్ పబ్లిక్ సర్వెంట్-2026కు రేవంత్‌రెడ్డి ఎంపిక
- కేరళ నిలంబూరులో అవార్డు ప్రదానోత్సవం
- రైతు, బీసీ, ప్రజా సంక్షేమ పాలనకు గుర్తింపు

హైదరాబాద్, సెప్టెంబర్ 24 :



ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ప్రతిష్టాత్మక 'ఆర్యదాన్ ముహమ్మద్ బెస్ట్ పబ్లిక్ సర్వెంట్ 2026□ (ఉత్తమ ప్రజా సేవకుడు) అవార్డుకు ఎంపికయ్యారు. కేరళకు చెందిన దిగ్గజ కాంగ్రెస్ నేత, దివంగత ఆర్యదాన్ ముహమ్మద్ స్మారకార్థం ముహమ్మద్ ఫౌండేషన్ ఈ పురస్కారాన్ని అందజేస్తోంది. తెలంగాణలో రైతులు, వెనుకబడిన వర్గాలు, సామాన్య ప్రజల సంక్షేమానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేపట్టిన వినూత్న కార్యక్రమాలు, దూరదృష్టి గల నాయకత్వానికి గాను ఈ అవార్డుకు ఎంపిక చేసినట్లు ఫౌండేషన్ వర్కింగ్ చైర్మన్, నిలంబూర్ ఎమ్మెల్యే ఆర్యదాన్ షౌకత్ తెలిపారు. అవార్డు ఎంపికకు ఎంపీ బెన్నీ బెహనన్, కేరళ రెవెన్యూ శాఖ మంత్రి ఎ.పి.అనిల్‌కుమార్, ప్రముఖ మేధావి కల్పేట్టా నారాయణన్ జ్యూరీగా వ్యవహరించారు. ప్రజాస్వామిక విలువలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఉన్న నిబద్ధతను జ్యూరీ ప్రత్యేకంగా కొనియాడింది. ఆర్యదాన్ ముహమ్మద్ నాలుగో వర్ధంతిని పురస్కరించుకుని కేరళలోని నిలంబూర్‌లో శుక్రవారం ఉదయం 10 గంటలకు అవార్డును ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రదానం చేస్తారు. పురస్కారం కింద రూ.లక్ష నగదు బహుమతి, ప్రశంసా పత్రం, జ్ఞాపికను అందజేస్తారు. వేడుకలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి (సంస్థాగత) కె.సి. వేణుగోపాల్ ఆర్యదాన్ ముహమ్మద్ స్మారక ఉపన్యాసం చేస్తారు. ముహమ్మద్ కేరళ కాంగ్రెస్ సీనియర్ నేత. ఎనిమిది సార్లు ఎమ్మెల్యేగా, కేరళలోని వివిధ మంత్రివర్గాల్లో నాలుగుసార్లు వివిధ శాఖలకు మంత్రిగా సేవలు అందించారు. రాజనీతిజ్ఞుడైన ముహమ్మద్ దూరదృష్టి గల నేతగా, అద్భుతమైన పార్లమెంటేరియన్‌గా, సమర్థుడైన పాలకునిగా, కార్మికవర్గ ఛాంపియన్‌గా కేరళ ప్రజల మదిలో నిలిచిపోయారు. నిజాయతీ, లౌకిక విలువలు, ప్రజా సంక్షేమ పాలనకు మారుపేరుగా ముహమ్మద్ నిలిచారు.

## దానం పార్టీ ఫిరాయింపు తప్పే

మొదటిపేజీ తరువాయి

సూర్యకాంత్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం విచారించింది. దానం పిటిషన్‌పై విచారణకు న్యాయస్థానం నిరాకరించింది. ఆయనపై అనర్హత వేటు పడిందని.. మళ్లీ ఎన్నికలకు వెళ్లాలని అభిప్రాయపడింది. వ్యక్తిగతంగా పార్టీలో చేరితే తప్పు కాదని.. పదవితోపాటు ఫిరాయింపు తప్పేనని ధర్మాసనం తేల్చి చెప్పింది. హైకోర్టు ఉత్తర్వుల్లో ఎలాంటి జోక్యం చేసుకోమని నిరాకరిస్తూ పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. ఎమ్మెల్యేగా రాజీనామా చేయకపోయినా లేదా అధికారికంగా రాజీనామా పత్రం ఇవ్వకపోయినా వేరే రాజకీయ పార్టీ టికెట్‌పై నామినేషన్ వేసి పోటీ చేయడం రాజ్యాంగబద్ధంగా పార్టీని వీడినట్లేనని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. అసెంబ్లీ స్పీకర్ నిర్ణయం న్యాయసమీక్షకు లోబడి ఉంటుందని, సుస్పష్టమైన ఆధారాలు (మరో పార్టీ బీఫాంపై పోటీ చేయడం) ఉన్నప్పుడు స్పీకర్ చర్య తీసుకోకపోవడం రాజ్యాంగ ఉల్లంఘన కిందకే వస్తుందని సుప్రీం కోర్టు తెలిపింది. దానం తరఫున సీనియర్ కౌన్సిల్ ముకుల్ రోహత్గీ వాదనలు వినిపించారు. దానం తిరిగి సొంత పార్టీకి వచ్చి(ఘర్ వాపసీ) పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారని, ఆయనపై పార్టీ నుంచి ఎలాంటి ఫిర్యాదు లేదని అన్నారు. ఆయనపై అనర్హత వేటు పడకూడదని అన్నారు. పార్టీ సభ్యత్వాన్ని పునరుద్ధరించుకోవడం వేరు.. చట్టసభ సభ్యత్వాన్ని నిలబెట్టుకోవడం వేరు అని ధర్మాసనం అభిప్రాయపడింది. పార్టీలోకి తిరిగి వచ్చినంత మాత్రాన చట్టసభ సభ్యత్వంపై పడే అనర్హత వేటు తొలగిపోదని సుప్రీంకోర్టు పేర్కొంది.

## సుప్రీం తీర్పు కాంగ్రెస్, బీఆర్ఎస్‌లకు గుణపాఠం

- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 24 :

పార్టీ ఫిరాయింపులకు పాల్పడి ప్రజాతీర్పును అపహాస్యం చేసిన ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ శాసనసభ సభ్యత్వాన్ని రద్దు చేయాలన్న హైకోర్టు తీర్పును సుప్రీంకోర్టు సమర్థించడాన్ని మనస్ఫూర్తిగా స్వాగతిస్తున్నట్లు కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ తీర్పు ఒక్క కాంగ్రెస్ పార్టీకి సంబంధించిన అంశమే కాదని, కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు చట్టవ్యతిరేకంగా అనుసరిస్తున్న పార్టీ ఫిరాయింపుల రాజకీయాలకు ఇది ఒక గుణపాఠమని అన్నారు. పతిపక్షంలో ఉన్నప్పుడు పార్టీ ఫిరాయింపులను విమర్శించడం, అధికారంలో ఉన్నప్పుడు ప్రతిపక్ష ఎమ్మెల్యేలను తమ పార్టీలో చేర్చుకోవడం, వారికి మంత్రి పదవులు ఇవ్వడం రాష్ట్ర రాజకీయాల్లో ఈ రెండు పార్టీలు ఒక దురదృష్టకరమైన సంస్కృతిగా మార్చాయని విమర్శించారు. ప్రజాతీర్పును కాలరాయడంలో కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు పోటీ పడుతున్నాయన్నారు. ఇది ఈ పార్టీల రాజకీయ ద్వంద్వ వైఖరికి అద్దం పడుతున్నదన్నారు. ప్రజాతీర్పును తమ రాజకీయ అవసరాలకు అనుగుణంగా మార్చుకుంటున్న కాంగ్రెస్, బీఆర్ఎస్ అవకాశవాద రాజకీయాలకు సుప్రీంకోర్టు తీర్పు స్పష్టమైన హెచ్చరిక అని మంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. దానం నాగేందర్ అనర్హతతో ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానం ఖాళీ అయిందని, ఇప్పుడు ఖైరతాబాద్ ప్రజలు అవకాశవాద, స్వార్థ, ఫిరాయింపు రాజకీయాలకు వ్యతిరేకంగా తమ ప్రతినిధిని ఎన్నుకునే అవకాశం రానుందని తెలిపారు. ప్రజాస్వామ్యంలో అంతిమ నిర్ణేతలు ప్రజలేనని, ఈ రెండు పార్టీల కుళ్లు రాజకీయాలకు తగిన బుద్ధి చెప్పి వచ్చే ఉప ఎన్నికలో బీజేపీకి పట్టంగట్టడం ఖాయం అని కిషన్‌రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు.

## ఎన్నికల సంఘం నిరంకుశ ధోరణి

మొదటిపేజీ తరువాయి

అవసరం ఉందని అన్నారు. ముగ్గురిలో ఇద్దరు ఒక నిర్ణయానికి వ్యతిరేకంగా ఉన్నప్పుడు అది మెజారిటీ కాదా అని ప్రశ్నించారు. ఇప్పటివరకు మెజారిటీ అంటే ఇదే కదా.. ఇప్పుడు దాని నిర్వచనం కూడా మారుతున్నట్టుందని కేటీఆర్ వ్యాఖ్యానించారు. ఓటర్ల నమోదు, ఓట్ల తొలగింపు, తొలగించిన ఓట్లను తిరిగి చేర్చడం వంటి అంశాల్లో సందేహాలకు తావిచ్చేలా నిర్ణయాలు తీసుకుంటే అసలు మనం ఇంకా ప్రజాస్వామ్యంలోనే ఉన్నామా అని ఆయన నిలదీశారు. దేశ భవిష్యత్తును ప్రజాస్వామ్య పరిరక్షణ బాధ్యత ఉన్న సంస్థ పునాదులే బలహీనపడుతున్న పరిస్థితిలో దాని నిర్ణయాలకు వదిలేయలేమని కేటీఆర్ అన్నారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు రాజకీయ పార్టీలు, రాజ్యాంగ సంస్థలు, పౌర సంఘాలు, ముఖ్యంగా సుప్రీంకోర్టు కలిసి ముందుకు రావాలని ఆకాంక్షించారు. తెలంగాణలో ఓట్ల తొలగింపుపైనా కేటీఆర్ తీవ్రంగా స్పందించారు. తెలంగాణలో అత్యధిక ఓట్ల తొలగింపులు బీఆర్ఎస్ గెలిచిన స్థానాల్లోనే ఉండటం ఆశ్చర్యం కలిగించలేదు అని అన్నారు. తెలంగాణలో ప్రస్తుతం ఒకే పోరాటం జరుగుతున్నదని, అది కేసీఆర్ వర్సెస్ అందరూ అని కేటీఆర్ పేర్కొన్నారు. బీఆర్ఎస్‌ను ఓడించేందుకు కాంగ్రెస్, బీజేపీలు కలిసి అనైతిక, అక్రమ, బహిరంగంగా ప్రకటించని కుమ్మక్కుకు పాల్పడ్డాయని ఆరోపించారు. ఇప్పుడు ఆ కుమ్మక్కులోకి ఎన్నికల సంఘం కూడా చేరుతున్నట్టు కనిపిస్తున్నదన్నారు. ఈ వ్యవహారంపై బీఆర్ఎస్ న్యాయస్థానాల్లోనూ, ప్రజల మధ్యనూ పోరాడుతుందని కేటీఆర్ స్పష్టం చేశారు. చట్టవిరుద్ధంగా తొలగించిన ప్రతి ఓటును తిరిగి చేర్పిస్తామని ప్రకటించారు. తెలంగాణలో ఒకే ఒక్క 'సార్' ఉన్నారు.. అది కేసీఆర్ సార్. ప్రజలకు ఆయనపై ఉన్న ప్రేమను ఏ ఎస్ఐఆర్' కూడా ఓడించలేదు అని అన్నారు.



## 22ఏ భూముల రిజిస్ట్రేషన్లకు గ్రీన్‌సిగ్నల్

హైదరాబాద్, సెప్టెంబరు 24:

తెలంగాణలో 22ఏ నిషేధిత భూముల వ్యవహారంపై ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, డీటీసీపీ వంటి ప్రభుత్వ అధీకృత సంస్థల నుంచి అనుమతులు పొందిన నివాస ప్లాట్లు, లేఅవుట్ల భూములు 22ఏ జాబితాలో ఉన్నప్పటికీ వాటి రిజిస్ట్రేషన్లకు అనుమతించాలని ఆదేశించింది. ఈ నిర్ణయం తక్షణమే అమల్లోకి రానుంది.

**అనుమతులున్నా ఇబ్బందులు**

గతంలో సంబంధిత ప్రభుత్వ సంస్థల నుంచి లేఅవుట్ అనుమతులు పొందినప్పటికీ, ఆయా భూముల సర్వే నంబర్లు 22ఏ నిషేధిత జాబితాలో ఉండటంతో రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి. దీంతో ఇప్పటికే స్థలాలు కొనుగోలు చేసిన యజమానులు వాటిని విక్రయించలేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. తాజాగా ప్రభుత్వం ఇచ్చిన వెసులుబాటుతో ఆమోదిత లేఅవుట్లలోని అర్హత కలిగిన ప్లాట్ల రిజిస్ట్రేషన్లకు మార్గం ఏర్పడింది.

**రిజిస్ట్రేషన్లకు ఊపొచ్చే అవకాశం**

చెల్లుబాటయ్యే ఆమోదిత లేఅవుట్ ప్రణాళికలు, సంబంధిత అనుమతి పత్రాలు ఉన్న భూముల రిజిస్ట్రేషన్లు ఇక వేగవంతం కానున్నాయి. దీంతో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో పెండింగ్‌లో ఉన్న లావాదేవీలకు పరిష్కారం లభించే అవకాశం ఉంది. రియల్ ఎస్టేట్ లావాదేవీలు పెరగడంతో పాటు రిజిస్ట్రేషన్ చార్జీల రూపంలో ప్రభుత్వ ఆదాయంపైనా ప్రభావం పడే అవకాశం ఉంది.

# యుద్ధాన్ని కోరుకోం... భద్రతపై రాజీ లేదు

- దేశ రక్షణ విషయంలో నిర్ణయాత్మక చర్యలకు వెనుకాడబోమన్న రాజ్‌నాథ్ సింగ్
- రూ.2.5 లక్షల కోట్ల నుంచి రూ.7.5 లక్షల కోట్లకు రక్షణ బడ్జెట్
- నాలుగు రెట్లు పెరిగిన స్వదేశీ రక్షణ ఉత్పత్తి
- ఆపరేషన్ సిందూర్‌లో భారత సత్తా ప్రపంచానికి తెలిసిందని వ్యాఖ్య
- అణు బెదిరింపులు, ఉగ్రవాదాన్ని సహించేది లేదని స్పష్టీకరణ

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 24:**

భారత్ యుద్ధాన్ని కోరుకోవడం లేదని, అదే సమయంలో దేశ భద్రత, సార్వభౌమత్వాన్ని కాపాడుకునే విషయంలో ఎలాంటి రాజీ ఉండదని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ స్పష్టం చేశారు. ఢిల్లీలో గురువారం జరిగిన 'డెఫ్‌కాన్2026'లో ఆయన మాట్లాడారు. దేశ రక్షణ బడ్జెట్‌ను రూ.2.5 లక్షల కోట్ల నుంచి రూ.7.5 లక్షల కోట్లకు పెంచామని, స్వదేశీ రక్షణ ఉత్పత్తి నాలుగు రెట్లు వృద్ధి చెందిందని తెలిపారు. ప్రస్తుతం ఒక్క రక్షణ ప్రభుత్వ రంగ సంస్థ కూడా నష్టాల్లో లేదన్నారు.

**స్వదేశీ తయారీకి పెద్దపీట**

రక్షణ రంగంలో విదేశాలపై ఆధారపడటాన్ని తగ్గిస్తూ దేశీయంగా డిజైన్, అభివృద్ధి, తయారీ సామర్థ్యాలను పెంచుతున్నట్లు రాజ్‌నాథ్ చెప్పారు. రక్షణ పరిశోధన, అభివృద్ధిపై వ్యయం రూ.29 వేల కోట్లు దాటిందని, 5,522 వస్తువులను పాజిటివ్ ఇండిజనైజేషన్ జాబితాలో చేర్చినట్లు వెల్లడించారు. ఐదో, ఆరో తరం యుద్ధ విమానాలపైనా పనిచేస్తున్నామని తెలిపారు. కృత్రిమ మేధ ఆధారిత స్వదేశీ సాంకేతికతలతోపాటు సైబర్ రంగంలో సామర్థ్యాలను బలోపేతం చేస్తున్నట్లు వివరించారు. సాయుధ దళాలకు అవసరమైన కార్యాచరణ స్వేచ్ఛ ఇచ్చామని పేర్కొన్నారు.

**ఉగ్రవాదం.. చర్చలు కలిసి సాగవు**

ఆపరేషన్ సిందూర్ సమయంలో భారత రక్షణ సామర్థ్యాన్ని ప్రపంచం చూసిందని రాజ్‌నాథ్ అన్నారు. భారత్ దౌత్యాన్ని విశ్వసిస్తూనే జాతీయ భద్రతకు అవసరమైతే నిర్ణయాత్మక చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేశారు. అణు బెదిరింపులను సహించబోమని, ఉగ్రవాదం కొనసాగుతున్న సమయంలో చర్చలు, వాణిజ్యం ఒకేసారి సాగలేవని పేర్కొన్నారు. 'రక్తం, నీరు కలిసి ప్రవహించవు' అనే సందేశం ఇచ్చేందుకే సింధు జలాల ఒప్పందాన్ని నిలిపివేసినట్లు చెప్పారు. పహల్గామ్ ఉగ్రదాడితో పాకిస్థాన్ 'లక్ష్మణరేఖ' దాటిందని వ్యాఖ్యానించారు. మారుతున్న ముప్పులకు అనుగుణంగా సాయుధ దళాలను భవిష్యత్ సవాళ్లకు సిద్ధం చేయాల్సిన అవసరం ఉందన్నారు.

# ఫైర్ సేఫ్టీకి అత్యంత ప్రాధాన్యం

- హాస్పిటల్లో ఫైర్ సేఫ్టీపై మంత్రి దామోదర్ సమీక్ష

**హైదరాబాద్, సెప్టెంబర్ 24 :**



ప్రభుత్వ, ప్రైవేటు హాస్పిటల్స్‌లో ఫైర్ సేఫ్టీ ఆడిట్‌పై అధికారులతో వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ గురువారం సమీక్షించారు. హాస్పిటళ్లలో ఫైర్ సేఫ్టీ ప్రమాణాల అమలు, లోపాల గుర్తింపు, సరిదిద్దే చర్యలపై చర్చించారు. ప్రభుత్వ హాస్పిటళ్లలో ఫైర్ సేఫ్టీకి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని, ఫైర్ సేఫ్టీ ఆడిటింగ్ కూడా క్రమం తప్పకుండా చేయిస్తున్నామని మంత్రికి ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు వివరించారు. ఇప్పటికే నిర్వహించిన ఫైర్ ఆడిట్లలో గుర్తించిన అంశాలు, తీసుకున్న చర్యలపై మంత్రి సమీక్షించారు. ఫైర్ సేఫ్టీ లోపాలు ఉన్నచోట తక్షణమే అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. సమావేశంలో స్పెషల్ సీఎస్ నవీన్ మిట్టల్, ప్రిన్సిపల్ సెక్రటరీ క్రిస్టినా జడ్ చొంగ్తు, ఫైర్ సేఫ్టీ డిపార్ట్‌మెంట్ డీజీ విక్రమ్ సింగ్ మాన్, హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ డాక్టర్ సంగీత సత్యనారాయణ, హెల్త్, ఎనర్జీ, ఆర్ అండ్ బీ, తదితర శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు

# వ్యాపార వృద్ధికే 'రక్షా ఎక్స్ పో'

- తెలంగాణలో వ్యాపార అవకాశాలను అన్వేషించాలి
- పెట్టుబడిదారులకు సీఎస్ సంజయ్ జాజు పిలుపు

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 24 :**

ప్రపంచస్థాయి ఏరోస్పేస్, రక్షణ రంగ కంపెనీలు, భారతీయ తయారీదారులు, ఎంఎస్ఎంఈలు, స్టార్టప్‌లు, టెక్నాలజీ డెవలపర్లు ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ 2026లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న 'రక్షా ఎక్స్‌పో 2026'లో పాల్గొని తెలంగాణలో ఉన్న అవకాశాలను అన్వేషించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఆహ్వానించారు. న్యూఢిల్లీలో గురువారం జరిగిన 'న్యూస్ 18 డిఫ్‌కాన్ 2026' సదస్సులో ఆయన ప్రసంగిస్తూ హైదరాబాద్ భారత్ ఫ్యూచర్ సిటీలో డిసెంబర్ 7 నుండి జరగనున్న ఈ ఎక్స్‌పో ప్రధానంగా వ్యాపార వృద్ధిపై దృష్టి పెట్టనుందన్నారు. గ్లోబల్ ఒరిజినల్ ఎక్విప్‌మెంట్ తయారీదారులు, భారతీయ కంపెనీలు, ఎంఎస్ఎంఈలు, స్టార్టప్‌లు, ప్రొక్యూర్‌మెంట్ బృందాల మధ్య ప్రత్యేకంగా బిజినెస్‌టుబిజినెస్(బీ2బీ) సమావేశాలు, ప్రత్యక్ష చర్చలు జరుగుతాయని తెలిపారు. ఈ వేదిక వెండార్ల అభివృద్ధికి, సాంకేతిక భాగస్వామ్యాలకు, భారతీయ సరఫరాదారులను దేశీయ, అంతర్జాతీయ సప్లై చైన్‌లలో అనుసంధానించడానికి ఎంతగానో దోహదపడుతుందన్నారు. తెలంగాణలో తయారీ కేంద్రాలు, గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు, ప్రత్యేక ఇంజనీరింగ్ టెస్ట్ బెడ్‌లు, జాయింట్ వెంచర్ల ఏర్పాటుకు భారతీయ సరఫరాదారులను ఎంపిక చేసుకోవాలని గ్లోబల్ కంపెనీలను ప్రోత్సహించనున్నట్లు స్పష్టం చేశారు. పాల్గొనే కంపెనీలకు, కాబోయే వ్యాపార భాగస్వాములకు మధ్య ముందే నిర్ధారించిన సమావేశాలను ఏర్పాటు చేయడానికి మిలిటరీ అటాచ్‌లు, కౌన్సులర్ ట్రేడ్ ఆఫీసులు కూడా సహకరిస్తాయని వివరించారు. రక్షా ఎక్స్‌పోలో ప్రత్యేకంగా ఏరోస్పేస్, డిఫెన్స్ అండ్ స్పేస్ కాంక్లేవ్, అధునాతన సాంకేతిక ప్రదర్శన, ఎయిర్ షో, లైవ్ ప్రదర్శనలు ఉంటాయని తెలిపారు. కంపెనీలు తమ డ్రోన్లు, కౌంటర్‌డ్రోన్ సిస్టమ్స్, అటానమస్ ప్లాట్‌ఫాంలు ల్యాండ్‌బేస్డ్ రక్షణ పరికరాలను ప్రదర్శించవచ్చన్నారు. వివిధ దేశాలకు చెందిన పెవిలియన్‌లతోపాటు, భారతీయ ఎంఎసఎంఈలు, స్టార్టప్‌ల కోసం ప్రత్యేక టెక్నాలజీ జోన్‌లను కూడా ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. గ్లోబల్ కంపెనీలు తమ సీనియర్ లీడర్‌షిప్, ప్రొక్యూర్‌మెంట్ హెడ్‌లు, సోర్సింగ్ బృందాలను ఈ సమ్మిట్‌కు పంపాలని ప్రధాన కార్యదర్శి ఆహ్వానించారు. ఎగ్జిబిషన్ స్పేస్‌ను బుక్ చేసుకోవాలని, తమ సామర్థ్యాలను ప్రదర్శించాలని, బీ2బీ సెషన్లలో పాల్గొనాలని, పెట్టుబడిదారులు, సోర్సింగ్ భాగస్వామ్యాలు, అవగాహన ఒప్పందాలు కుదుర్చుకోవడానికి ఈ సమ్మిట్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 2025 26లో తెలంగాణ ఏరోస్పేస్, రక్షణ రంగ ఎగుమతులలో సాధించిన 103 శాతం వృద్ధిని, అలాగే వ్యూహాత్మక పరిశోధనా సంస్థలు, డిఫెన్స్ పీఎస్‌యూలు, దాదాపు 1,500 నుండి 2,000 ప్రెసిషన్‌ఇంజనీరింగ్ ఎంఎస్ఎంఈలతో కూడిన బలమైన పర్యావరణ వ్యవస్థను ప్రధాన కార్యదర్శి తన ప్రసంగంలో హైలైట్ చేశారు.

# వోట్ల చోరీ నుంచి చట్టాల చోరీ వరకు..

- నచ్చిన ఈసీల కోసం నల్ల చట్టాలు
- ఎన్నికల సంఘంపై రాహుల్ గాంధీ తీవ్ర ఆరోపణలు
- సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్
- అప్రూవర్ గా మారితే అది దేశభక్తి అవుతుందని వ్యాఖ్య
- – ఎన్నికల్లో అక్రమాలు జరిగాయని ఆరోపణలు

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 24 :**

దేశ ఎన్నికల వ్యవస్థ, వోటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ, ఎన్నికల సంఘంలో నిర్ణయాలు తీసుకునే విధానంపై లోక్సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ గురువారం తీవ్ర ఆరోపణలు చేశారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల వ్యవస్థకు సంబంధించిన అంశాలపై దర్యాప్తు జరిగితే గ్యానేశ్ కుమార్ అప్రూవర్ గా మారి తనకు తెలిసిన విషయాలను వెల్లడించాలని సూచించారు. గత పది నెలల వ్యవధిలో ఎన్నికల సంఘం తీసుకున్న పలు నిర్ణయాలపై ఇద్దరు ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి కనీసం 14 సార్లు లిఖితపూర్వక అభ్యంతరాలు వ్యక్తం చేసినట్లు 'ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్' దర్యాప్తు కథనం వెలువడిన నేపథ్యంలో రాహుల్ గాంధీ ఈ ప్రత్యేక విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆ అభ్యంతరాలు కొత్త వోటర్ల నమోదు, ఫారం6, వోటర్ల పేర్ల తొలగింపు - పునరుద్ధరణ, ఎన్నికల జాబితా అప్పీళ్లు, డిజిటల్ వోటర్ డేటాబేస్ నిర్వహణ తదితర అంశాలకు సంబంధించినవని నివేదిక పేర్కొంది. ప్రెస్మీట్ ప్రారంభంలోనే రాహుల్



గాంధీ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, ఆర్ఎస్ఎస్ అధినేత మోహన్ భాగవత్, వ్యాపార వేత్త గౌతమ్ అదానీ, జాతీయ భద్రతా సలహా దారు అజిత్ దోవల్, ప్రధాన ఎన్నికల కమిషనర్ గ్యానేశ్ కుమార్ తదితరుల చిత్రాలను ప్రదర్శిం చారు. ఎన్నికలను ప్రభావితం చేసే విస్తృత వ్యవస్థలో వీరికి పాత్ర ఉందని ఆయన ఆరోపించారు. ఇవి రాహుల్ గాంధీ చేసిన రాజకీయ ఆరోపణలే తప్ప స్వతంత్ర విచారణ లేదా న్యాయస్థానం నిర్ధారించిన అంశాలు కావు.

**ఎన్నికల్లో 100 శాతం అక్రమాలు జరుగుతున్నాయి**

"నేను గాలిలో ఆరోపణలు చేయడం లేదు. గతంలో ఆధారాలు చూపించాను. ఇప్పుడు బయటకు వస్తున్న సమాచారం చూస్తే ఎన్నికల వ్యవస్థలో అక్రమాలు జరుగుతున్నాయనే విషయంలో నాకు 99 శాతం కాదు, 100 శాతం నమ్మకం ఉంది" అని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. లోకసభ ఎన్నికలతోపాటు వివిధ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో కూడా అక్రమాలు జరిగాయని ఆయన ఆరోపించారు. ఎన్నికల ఫలితాలపై కాంగ్రెస్ గతంలో లేవనెత్తిన ప్రశ్నలకు ఎన్నికల సంఘం సరైన సమాధానాలు ఇవ్వలేదని విమర్శించారు.

**యాంటీ ఇన్ కంబెన్సీ ఎక్కడికి పోయింది?**

భారత ఎన్నికల రాజకీయాల్లో అధికార వ్యతిరేకత —— యాంటీ ఇన్కంబెన్సీ - సహజమైన అంశమని రాహుల్ పేర్కొన్నారు. "నేను రాజకీయ కుటుంబంలో పుట్టాను. ఐదు దశాబ్దాలకు పైగా రాజకీయాలను చూస్తున్నాను. ఎంత ప్రజాదరణ ఉన్న నాయకుడికైనా కొంతకాలానికి అధికార వ్యతిరేకత వస్తుంది. అది ఏ రాజకీయ పార్టీని వదలదు" అని ఆయన అన్నారు. 1971 బంగ్లాదేశ్ యుద్ధం తర్వాత అప్పటి ప్రధానమంత్రి ఇందిరా గాంధీ అత్యంత ప్రజాదరణ పొందినప్పటికీ తర్వాత కాంగ్రెస్ కు రాజకీయ ఎదురుదెబ్బలు తగిలాయని గుర్తు చేశారు. అయితే ప్రస్తుతం కొన్ని రాష్ట్రాల్లో బీజేపీకి వ్యతిరేకంగా ఇటువంటి ధోరణి ఎందుకు కనిపించడం లేదని ప్రశ్నించారు.

**వోటు చోరీ నుంచి చట్టాల చోరీ**

ప్రెస్ మీట్‌లో రాహుల్ గాంధీ ప్రధానంగా "వోటుచట్టంసంస్థలురాజ్యాంగం" మధ్య ఉన్న సంబంధాన్ని వివరించే ప్రయత్నం చేశారు. వోటు ప్రజాస్వామ్యానికి పునాది అని, ప్రజల వోటు సక్రమంగా నమోదు కాకపోతే ఎన్నికైన ప్రజాప్రతినిధుల చట్టబద్ధతపైనే ప్రశ్నలు వస్తాయని ఆయన అన్నారు. వోటు చోరీ నుంచి 'కానూన్ చోరీ వస్తుంది. వోటు దొంగిలించబడితే చట్ట నిర్మాణ వ్యవస్థ దెబ్బతింటుంది. వోటు, చట్టాలు, సంస్థలు, రాజ్యాంగం మధ్య ఉండాల్సిన గొలుసు తెగిపోయే పరిస్థితి ఏర్పడింది. భారతదేశం ఇంతకుముందు చూడని కొత్త పరిస్థితిలోకి వెళ్లింది అని మీడియా ప్రశ్నకు సమాధానంగా రాహుల్ పేర్కొన్నారు.

**జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలి**

ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ పై రాహుల్ గాంధీ నేరుగా ఆరోపణలు చేశారు. జ్ఞానేశ్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలి. ఆయన చేసిన పని దేశ ప్రయోజనాలకు వ్యతిరేకమైనది అని అన్నారు. ఇద్దరు ఎన్నికల కమిషనర్లు కూడా కొన్ని నిర్ణయాలపై అభ్యంతరాలు వ్యక్తం చేసినట్లు వార్తలు రావడాన్ని రాహుల్ ప్రస్తావించారు. జ్ఞానేశ్ కుమార్ కు తాను ఒక అవకాశం ఇస్తున్నానని రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. ఆయన అప్రూవర్ గా మారాలి.. నిజంగా ఏం జరిగిందో చెప్పాలి.. అలా చేయడం దేశభక్తి అవుతుంది అని అన్నారు. మీడియా ప్రశ్నకు సమాధానంగా 'నేను ఇంతకుముందే చెప్పాను ఆయన అప్రూవర్ గా మారాలి అని రాహుల్ పేర్కొన్నారు.

**ఇద్దరు కమిషనర్లను ప్రశంసించిన రాహుల్**

ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి అభ్యంతరాలు నమోదు చేసినట్లు వచ్చిన వార్తలను రాహుల్ స్వాగతించారు. 'ఇద్దరు ఎన్నికల కమిషనర్లు నిజాన్ని బయటకు తీసుకురావడంలో సరైన పని చేశారు.. వారిని నేను అభినందిస్తున్నాన'ని చెప్పారు. దేశంలోని సంస్థల్లో పనిచేసే మరింత మంది అధికారులు తమకు తెలిసిన విషయాలను ధైర్యంగా బయట పెట్టాలని పిలుపునిచ్చారు. 'వ్యవస్థలో సమస్య ఉందని దేశంలో చాలామంది అనుకుంటున్నారు.. కానీ భయంతో మాట్లాడటం లేదు.. ఇప్పుడు ఆ భయం తగ్గుతోంది.. ఇద్దరు ఎన్నికల కమిషనర్లు మాట్లాడారు.. వారిలాంటి దేశ భక్తులు ఇంకా ఉన్నారు' అని చెప్పారు.

**అంతర్గత అభిప్రాయ భేదాలు సహజమే : ఈసీఐ**

ఇద్దరు ఎన్నికల కమిషనర్ల అభ్యంతరాలపై వచ్చిన కథ నాలకు ఎన్నికల సంఘం కూడా స్పందించింది. ఒక సంస్థలో తుది నిర్ణయానికి ముందు సభ్యులు వివిధ అభి ప్రాయాలు, సూచనలు, ప్రశ్నలు లేవనెత్తడం సహజమైన పరిపాలనా ప్రక్రియ అని ఎన్నికల సంఘం పేర్కొంది. "operational queries or inputs"ను తుది నిర్ణయాలపై అసమ్మతిగా చిత్రీకరించడం సరైంది కాదని తెలిపింది. పది నెలల్లో వచ్చిన కొన్ని అంతర్గత నోట్లను మాత్రమే ప్రస్తావిస్తూ, అదే సమయంలో కమిషనర్లు ఆమోదించిన అనేక నిర్ణయాలు, ఆదేశాలు, కార్యక్రమాలను పక్కనపెట్టడం పూర్తి చిత్రాన్ని చూపదని ఎన్నికల సంఘం పేర్కొంది. ఎస్ఐఆర్ సహా కీలకమైన తుది నిర్ణయాలు ముగ్గురు కమిషనర్ల ఆమోదంతోనే జరిగాయని ఎన్నికల సంఘం వర్గాలు స్పష్టం చేశాయి.

# వారబందీతో జూరాల ఆయకట్టుకు నీరు

- రైతులను కాపాడుకునే బాధ్యత ప్రజా ప్రభుత్వానిదే
- జిల్లాలో ఒక్క ఎకరా కూడా ఎండనివ్వం : మంత్రి వాకిటి
- కర్ణాటక ముఖ్యమంత్రికి ధన్యవాదాలు

**వనపర్తి, సెప్టెంబర్ 24 :**

జూరాల ప్రాజెక్టు ఆయకట్టు రైతులకు వారబందీ విధానంలో సాగునీటిని అందిస్తామని క్రీడా, పాడి పరిశ్రమాభివృద్ధి, పశుసంవర్ధక, మత్స్య, యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి స్పష్టం చేశారు. రైతులకు సాగునీటి విషయంలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, జిల్లాలో ఒక్క ఎకరా కూడా ఎండిపోకుండా చూస్తామని స్పష్టం చేశారు. వనపర్తి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఉమ్మడి పాలమూరు జిల్లా ఇరిగేషన్ శాఖ అధికారులతో మంత్రులు వాకిటి శ్రీహరి, జూపల్లి కృష్ణారావు, ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యేలు సమీక్షా సమావేశం నిర్వహించారు. జూరాల ప్రాజెక్టు ఆయకట్టుకు సాగునీటి విడుదల, నీటి లభ్యత, ఆయకట్టు అవసరాలు, పంటలకు నీటి సరఫరా తదితర అంశాలపై అధికారులతో సమగ్రంగా చర్చించారు. ప్రస్తుత నీటి పరిస్థితిపై అధికారుల నుంచి వివరాలు తీసుకుని రైతులకు సకాలంలో సాగునీరు అందించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు. అనంతరం మీడియా సమావేశంలో మంత్రి వాకిటి మాట్లాడుతూ రైతులపై నిజమైన ప్రేమ కాంగ్రెస్ ప్రభుత్వానికే ఉందన్నారు. రైతులను కాపాడుకునే బాధ్యత ప్రజా ప్రభుత్వంపై ఉందని, ఒక్క ఎకరా కూడా ఎండిపోకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు. కృష్ణా నదిలో నీటి లభ్యత, జూరాల ఆయకట్టు అవసరాలను దృష్టిలో ఉంచుకుని వారబందీ పద్ధతిలో సాగునీటిని అందిస్తామని తెలిపారు. వచ్చే వేసవిలో తాగునీటికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఇప్పటినుంచే ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని చెప్పారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పాలమూరురంగారెడ్డి ప్రాజెక్టుపై తగిన శ్రద్ధ చూపలేదని మంత్రి విమర్శించారు. ఎన్నికల ముందు నార్లాపూర్ వద్ద ఒక్క పంపును ఆన్ చేసి ప్రాజెక్టు పూర్తయినట్లు ప్రచారం చేశారని ఆరోపించారు. పాలమూరు రైతుల ప్రయోజనాల కోసం గతంలో వరద నీటిని వినియోగించడంపై, కృష్ణా-భీమా నదులపై అవసరమైన బ్యారేజీల నిర్మాణంపై ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. కర్ణాటక ప్రభుత్వంతో చర్చలు జరిపి జూరాలకు నీటిని తీసుకురావడానికి ప్రభుత్వం ముందుగానే చర్యలు చేపట్టిందని, అయితే దీనిపై ప్రతిపక్షాలు రాజకీయ విమర్శలు చేస్తున్నాయని మంత్రి అన్నారు. జూరాల ప్రాజెక్టు నిర్మాణ నాణ్యతను ప్రస్తావిస్తూ భారీ వరద ప్రవాహాలు వచ్చిన సందర్భాల్లోనూ ప్రాజెక్టు నిలకడగా ఉందని మంత్రి తెలిపారు. రైతుల



ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని అందుబాటులో ఉన్న నీటిని సమర్థవంతంగా వినియోగించి ఆయకట్టుకు సాగునీరు అందిస్తామని మంత్రి వాకిటి హామీ ఇచ్చారు.

రాష్ట్రంలో పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని కోరిన వెంటనే రాష్ట్రానికి నీరు విడుదల చేసేందుకు అంగీకరించిన కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌కు ధన్యవాదాలు తెలిపారు. సాగునీటి విషయంలో ప్రస్తుతం తలెత్తిన పరిస్థితులు భవిష్యత్తులో రాకుండా అధికారులు, ప్రజాప్రతినిధులతో సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని సూచించారు. అధికారులు, ప్రజాప్రతినిధుల మధ్య సమాచార లోపం లేకుండా చూసుకోవాలని ఆదేశించారు. ప్రాజెక్టుల్లో అందుబాటులో ఉన్న నీటి నిల్వలు తదితర వివరాలను రోజూ మీడియాకు తెలియజేయాలని సూచించారు. తద్వారా రైతులు, ప్రజలకు నీటి పరిస్థితిపై స్పష్టమైన అవగాహన కలుగుతుందని తెలిపారు. సాగునీటి పంపిణీలో వారబందీ విధానాన్ని రైతులకు ముందుగానే వివరించి, అందుకనుగుణంగా పంటల సాగు ప్రణాళిక చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. రైతులకు ఎప్పటికప్పుడు వాస్తవ పరిస్థితులను తెలియజేయాలన్నారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని నీటి లభ్యతకు అనుగుణంగా సాగునీటి సరఫరాను కొనసాగించాలని సూచించారు. నీటి విడుదలకు సంబంధించి ఇరిగేషన్ అధికారులు ఏవైనా ఆదేశాలు లేదా నిర్ణయాలు తీసుకున్నప్పుడు వాటిని వెంటనే స్థానిక ప్రజాప్రతినిధులకు తెలియజేయాలన్నారు. అధికార యంత్రాంగం, ప్రజాప్రతినిధులు, రైతుల మధ్య నిరంతర సమన్వయం ఉండేలా చర్యలు తీసుకోవాలని, సమాచార లోపాలను పూర్తిగా తొలగించడం ద్వారా సాగునీటి నిర్వహణను మరింత సమర్థవంతంగా చేపట్టాలని మంత్రి వాకిటి ఆదేశించారు.

# 48 గంటల్లో సీఈసీ రాజీనామా చేయాలి

- లేకుంటే దేశవ్యాప్త ఆందోళన
- కాక్రోచ్ జనతా పార్టీ హెచ్చరిక
- వోటర్ల జాబితాల సవరణపై స్వతంత్ర విచారణకు డిమాండ్

**దిల్లీ, సెప్టెంబర్ 24:**

ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ 48 గంటల్లో పదవికి రాజీనామా చేయాలని కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) డిమాండ్ చేసింది. లేనిపక్షంలో దేశవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని, దిల్లీలో ధర్నా నిర్వహిస్తామని ప్రకటించింది. గురువారం న్యూదిల్లీలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దిప్కే మాట్లాడుతూ, స్వేచ్ఛాయుతమైన, నిష్పక్షపాత ఎన్నికల నిర్వహణ కోసం జ్ఞానేశ్ కుమార్ వైదొలగాల్సిందేనన్నారు. ఆయన రాజీనామా చేసేవరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఆందోళన కార్యక్రమాల పూర్తి వివరాలను త్వరలో వెల్లడిస్తామని తెలిపారు.



ప్రజలు తమ ప్రభుత్వాన్ని ఎన్నుకోవడమే ప్రజాస్వామ్యమని, కానీ ఇప్పుడు ఎవరు వోటు వేయాలో ప్రభుత్వమే నిర్ణయించే పరిస్థితి ఏర్పడిందని దిప్కే ఆరోపించారు. జ్ఞానేశ్ కుమార్ నాయకత్వంలోని ఎన్నికల కమిషన్ పనితీరు ప్రజాస్వామ్య మౌలిక భావనను తలకిందులు చేస్తోందని విమర్శించారు. వోటు హక్కును పరిరక్షించాల్సిన వ్యవస్థపైనే ప్రశ్నలు తలెత్తడం తీవ్ర ఆందోళనకరమన్నారు. జ్ఞానేశ్ కుమార్ దేశ ప్రజాస్వామ్యానికి ముప్పుగా మారారని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. వోటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) సందర్భంగా జరిగినట్లు ఆరోపిస్తున్న పేర్ల తొలగింపులను దిప్కే ప్రధానంగా ప్రస్తావించారు. మొత్తం 13 కోట్లకు పైగా వోట్లు తొలగించారని ఆయన ఆరోపించారు. అధికార, ప్రతిపక్షాల మధ్య ఎన్నికల పోటీని ప్రభావితం చేసేందుకే ఈ ప్రక్రియను ఉపయోగిస్తున్నారా అని ప్రశ్నించారు. ఈ సంఖ్య దిప్కే చేసిన ఆరోపణగా వార్తా కథనాల్లో నమోదైంది; స్వతంత్రంగా నిర్ధారిత గణాంకంగా వెల్లడికాలేదు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ సొంతంగా మెజారిటీ సాధించలేకపోయిన అనంతరం ప్రతిపక్ష, ప్రాంతీయ రాజకీయ శక్తులను బలహీనపరిచే ప్రయత్నాలు జరిగాయని దిప్కే ఆరోపించారు. ఉద్ధవ్ ఠాక్రే పార్టీ చీలిక, ఎన్నికల గుర్తు వివాదంలో కమిషన్ వ్యవహరించిన తీరునూ ప్రశ్నించారు. తమకు ఏ ప్రత్యేక ప్రతిపక్ష పార్టీ పట్ల అనుబంధం లేదని, అయితే ప్రతిపక్షాన్నే నిర్వీర్యం చేసే పరిస్థితుల్లో స్వేచ్ఛాయుత ఎన్నికలు ఎలా సాధ్యమని నిలదీశారు. ఎన్నికల కమిషన్‌లో అంతర్గత అభ్యంతరాలపై 'ఇండియన్ ఎక్స్‌ప్రెస్' ప్రచురించిన కథనం నేపథ్యంలో సీజేపీ ఈ డిమాండ్లను ముందుకు తెచ్చింది. ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధూ, వివేక్ జోషి పది నెలల్లో కనీసం 14 సందర్భాల్లో వోటర్ల జాబితాలు, ఎస్ఐఆర్‌కు సంబంధించిన నిర్ణయాలపై అభ్యంతరాలు వ్యక్తం చేసినట్లు ఆ కథనం పేర్కొంది. కొన్ని నిర్ణయాలు వారి దృష్టికి తీసుకురాకుండానే జరిగాయని కూడా తెలిపింది. కొనసాగుతున్న వోటర్ల జాబితాల సవరణను నిలిపివేసి, ఈ ప్రక్రియలో తీసుకున్న నిర్ణయాలపై స్వతంత్ర కమిషన్‌తో విచారణ జరిపించాలని సీజేపీ కోరింది. జ్ఞానేశ్ కుమార్‌పై క్రిమినల్ చర్యలు చేపట్టాలని పార్టీ సహ కన్వీనర్ సౌరవ్ దాస్ డిమాండ్ చేశారు. ప్రజల వోటు హక్కుకే రక్షణ లేకపోతే విద్య, అవినీతి వంటి సమస్యలపై చేస్తున్న పోరాటాల ఫలితాలు కూడా ప్రశ్నార్థకమవుతాయని ఆయన అభిప్రాయపడ్డారు.

# పోలీస్ పెట్రోలింగ్ వాహనాన్ని ఢీకొట్టిన లారీ

- ఎస్సై, డ్రైవర్‌కు తీవ్ర గాయాలు
- ఆసుపత్రిలో క్షతగాత్రులను పరామర్శించిన పోలీస్ కమిషనర్ సునీల్ దత్
- మెరుగైన చికిత్స కోసం డ్రైవర్ హైదరాబాద్‌కు తరలింపు
- తిరుమలాయపాలెం గ్రామ శివారులో అర్ధరాత్రి జరిగిన ఘోర ప్రమాదం



**ఖమ్మం రాజముద్ర న్యూస్:** విధులు నిర్వహిస్తున్న పోలీస్ వాహనాన్ని ఒక లారీ బలంగా ఢీకొట్టిన ఘోర ప్రమాదంలో సబ్ ఇన్‌స్పెక్టర్ (ఎస్సై), డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటన బుధవారం అర్ధరాత్రి తిరుమలాయపాలెం గ్రామ శివారులోని భవానీ హోటల్ సమీపంలో చోటుచేసుకుంది. పోలీసుల ప్రాథమిక విచారణ ప్రకారం.. పశ్చిమ గోదావరి జిల్లా ఆకివీడు నుండి ఉత్తరప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్‌కు చేపల లోడుతో వెళ్తున్న లారీ (AP-16-TH-6179), తిరుమలాయపాలెం గ్రామ శివారుకు చేరుకోగానే ఎదురుగా వస్తున్న పోలీస్ పెట్రోలింగ్ వాహనాన్ని బలంగా ఢీకొట్టింది. లారీ డ్రైవర్ షేక్ రసూల్ (65) వాహనాన్ని అత్యంత వేగంగా, అజాగ్రత్తగా నడపడం వల్లే ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది.

**క్షతగాత్రులకు తక్షణ వైద్యం..**

ప్రమాద సమాచారం అందిన వెంటనే పోలీస్ ఉన్నతాధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన తిరుమలాయపాలెం ఎస్సై కూచిపూడి జగదీశ్, వాహన డ్రైవర్ కొత్తపల్లి రాకేష్‌లను తక్షణమే చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఎస్సై జగదీశ్ పరిస్థితి నిలకడగా ఉండగా.. తీవ్రంగా గాయపడిన డ్రైవర్ రాకేష్‌కు మెరుగైన వైద్యం అందించడం కోసం హైదరాబాద్‌కు తరలించారు.

**పరామర్శించిన సీపీ.. నిరంతర పర్యవేక్షణకు ఆదేశాలు:**

ప్రమాద విషయం తెలుసుకున్న పోలీస్ కమిషనర్ సునీల్ దత్ రాత్రి ఆసుపత్రికి చేరుకుని క్షతగాత్రులను పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. బాధితులకు మెరుగైన వైద్యం అందేలా నిరంతరం పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం డ్రైవర్ రాకేష్ కుటుంబ సభ్యులను కలిసి ధైర్యం చెప్పారు. విధినిర్వహణలో ఉన్న సిబ్బంది ప్రమాదానికి గురికావడం పట్ల సీపీ తీవ్ర విచారం వ్యక్తం చేస్తూ, వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. లారీ డ్రైవర్‌పై నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకునేందుకు వివరాలు సేకరిస్తున్నారు.

# ప్రధాని మోదీ పాలనతో మన దేశం విశ్వ గురువుగా మారుతుంది...

- సేవా పౌండేషన్ అధ్యక్షులు ఆర్ నరేష్ కుమార్
- పాల్గొన్న మున్సిపల్ బిజెపి అధ్యక్షులు చెందిప్ప దయాకర్ రెడ్డి



**శంకర్ పల్లి, రాజముద్ర న్యూస్:** మన భారత ప్రధాని మోదీ పాలనలో మన దేశం విశ్వ గురువుగా మారుతుందని శంకర్ పల్లి సేవా ఫౌండేషన్ అధ్యక్షులు, భాజపా ఎండోమెంట్ సేల్ ధార్మిక రంగారెడ్డి జిల్లా రూరల్ జాయింట్ కన్వీనర్ ఆర్ నరేష్ కుమార్ పేర్కొన్నారు. వినాయక చవితి నవరాత్రుల సందర్భాన్ని పురస్కరించుకొని గురువారం నిమజ్జనం సందర్భంగా శంకర్ పల్లి చౌరస్తాలోని విజయ పాల షాపు వద్ద 500 మంది భక్తులకు అన్నప్రసాద వితరణ చేయడం జరిగింది. ఈ సందర్భంగా నరేష్ కుమార్ మాట్లాడుతూ...భక్తి భావనతో, ఆధ్యాత్మిక చింతనతో వేదమంత్రాలతో వినాయక చవితి నవరాత్రుల పూజలను భక్తులు ఘనంగా జరుపుకున్నారని, వారందరికీ వినాయకుని ఆశీర్వాదం తప్పకుండా లభిస్తుంది అన్నారు. నేడు దేశమంతటా భక్తి భావం వెల్లి విరుస్తుందంటే దీనికంతటికి అయోధ్య రామ మందిరం నిర్మాణం కోసం ప్రధానమంత్రి మోడీ తీసుకున్న దైవ నిర్ణయం ఒక కారణమని నరేష్ కుమార్ తెలిపారు. ప్రతి యువత స్వామి వివేకానందుని, చత్రపతి శివాజీని స్ఫూర్తిగా తీసుకొని హిందూ హైందవ జాతిని ప్రపంచానికి చాటి చెప్పాలి సూచించారు. శంకర్ పల్లి మున్సిపల్ బిజెపి అధ్యక్షులు చెందిప్ప దయాకర్ రెడ్డి మాట్లాడుతూ...ఇంత భారీగా అన్న ప్రసాద వితరణ చేసిన నరేష్ కుమార్ ను, సహకరించిన నోముల వెంకటేశంను అభినందించారు. నరేష్ కుమార్ చేస్తున్న సమాజ సేవలు ఆలయాల పునర్నిర్మాణ సేవలు చాలా గొప్పవని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సేవా ఫౌండేషన్ సభ్యులు మురళి కృష్ణ, వరకవి మధు, విజయ్ నంద, వెంకటయ్య, శేఖర్, అనురాధ గౌడ్, ఫౌండేషన్ అభిమానులు పాల్గొన్నారు.

# తెలంగాణ సాయుధ పోరాట యోధుడికి గౌరవం తగిన దక్కాలి..

- వరంగల్ మామునూర్ ఎయిర్ పోర్టుకు దొడ్డి కొమురయ్య పేరు పెట్టాలి
- చేవెళ్ల నియోజకవర్గ బిసి సంక్షేమ కురుమ సంఘం అధ్యక్షుడు బండమీది వెంకటేష్ డిమాండ్...




**శంకర్ పల్లి, రాజముద్ర న్యూస్:** తెలంగాణ రాష్ట్ర చరిత్రలో సాయుధ పోరాట యోధుడు, కురుమ బిడ్డ దొడ్డి కొమురయ్య త్యాగం మరువలేనిదని, నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడి అమరుడైన దొడ్డి కొమురయ్య పేరును వరంగల్ మామునూర్ విమానాశ్రయానికి పెట్టాలని కురుమ సమాజం మొత్తం ఏకమై డిమాండ్ చేస్తోందని చేవెళ్ల నియోజకవర్గ బిసి సంక్షేమ సంఘం (శంకర్ పల్లి మండల కురుమ సంఘం అధ్యక్షుడు) బండమీది వెంకటేష్ కురుమ పేర్కొన్నారు. అయన కురుమ సంఘం ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్త ఉద్యమానికి పిలుపునిచ్చారు. వరంగల్ విమానాశ్రయం పునరుద్ధరణ పనులు వేగంగా జరుగుతున్న నేపథ్యంలో, ఆ విమానాశ్రయానికి దొడ్డి కొమురయ్య పేరు పెట్టాలని ప్రభుత్వాన్ని కోరారు.

**వినతి పత్రాల సమర్పణకు పిలుపు...**

ఈ డిమాండ్‌ను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు రాష్ట్రంలోని అన్ని మండలాల్లోని ఆర్డీవో కార్యాలయాలు, అన్ని జిల్లాల కలెక్టర్ కార్యాలయాలలో వినతి పత్రాలు సమర్పించాలని చేవెళ్ల నియోజకవర్గ బి.సీ సంక్షేమ సంఘం (కురుమ సంఘం) అధ్యక్షుడు బండమీది వెంకటేష్ కురుమ పిలుపునిచ్చారు. దొడ్డి కొమురయ్య తెలంగాణ జాతి గర్వమని, ఆయన పేరు విమానాశ్రయానికి పెడితే భావి తరాలకు స్ఫూర్తిగా నిలుస్తుందన్నారు. కురుమ సమాజం ఆత్మగౌరవానికి ప్రతీకగా ఈ డిమాండ్ నెరవేరాలని బండమీది వెంకటేష్ కురుమ అన్నారు. వరంగల్ మామునూర్ ఎయిర్ పోర్టుకు దొడ్డి కొమురయ్య పేరు పెట్టడం ద్వారా ఆ మహనీయుడికి ఘన నివాళి అర్పించినట్లు అవుతుందని, ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని కురుమ సంఘం నాయకులు కోరుతున్నారన్నారు. ఈ ఉద్యమంలో కురుమ సమాజం అంతా కలిసి రావాలని విజ్ఞప్తి చేశారు.

# ఏర్వగూడలో ఘనంగా వినాయక నిమజ్జనోత్సవం..

ఏర్వగూడ గ్రామ సర్పంచ్ మన్నే పద్మ పాండు



**శంకర్ పల్లి, రాజముద్ర న్యూస్:** శంకర్ పల్లి మండలంలోని ఏర్వగూడ గ్రామంలో గురువారం వినాయక నిమజ్జన కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ మన్నే పద్మ పాండు ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గ్రామ పంచాయతీ సర్పంచ్ మన్నె పద్మ పాండు హాజరై గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా సర్పంచ్ మన్నె పద్మ పాండు మాట్లాడుతూ....వినాయక నవరాత్రి ఉత్సవాలను గ్రామస్థులు భక్తిశ్రద్ధలతో, ఐకమత్యంతో నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రతి ఒక్కరూ ప్రశాంత వాతావరణంలో పండుగలను జరుపుకోవాలని, గణనాథుడి ఆశీస్సులతో గ్రామ ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం భక్తులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని గణనాథుడి నిమజ్జన కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తుల కోసం అన్నప్రసాద కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించిన సభ్యులు ఎమ్ నర్సింలు యాదవ్, ఎమ్ సత్యనారాయణ యాదవ్, ఎమ్ రామాలింగం గౌడ్ నిర్వహించారు. భక్తులకు అన్నప్రసాదం అందించి తమ సేవాభావాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా అన్నదాతలను గ్రామస్థులు అభినందించారు. వినాయక నిమజ్జన కార్యక్రమం ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ప్రశాంతంగా, భక్తి వాతావరణంలో కొనసాగింది.

# కళ్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేసిన గ్రామ సర్పంచులు

**రామారెడ్డి, రాజముద్ర న్యూస్:** రామారెడ్డి మండలం రైతు వేదికలో గురువారం రోజున కళ్యాణ లక్ష్మి , షాదీ ముబారక్ చెక్కులు గ్రామ సర్పంచులు, అధికారులు ప్రజా ప్రతినిధులు లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు, మండలంలోని ఈ సన్న పల్లి గ్రామానికి రెండు, కన్నాపూర్ ఒకటి, పోసానిపేట గ్రామానికి రెండు, రంగంపేట గ్రామానికి మూడు, రామారెడ్డి 2 చెక్కులను పంపిణీ చేశారు, ఈ చెక్కులు పేదవారికి గొప్ప వరం లాంటిదని, ప్రతి లబ్ధిదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఈ సందర్భంగా అన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు, ఆర్ ఐ, ఉప సర్పంచ్ లు, పాలకవర్గ సభ్యులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.



# అన్నదానానికి వెళ్లి అనంతలోకాలకు..

## డ్రైనేజీలో పడి వృద్ధుడి మృతి



**ఖమ్మం రాజముద్ర న్యూస్:**వినాయక మండపం వద్ద అన్నదానానికి వెళ్లి తిరిగి వస్తుండగా వృద్ధుడు ప్రమాదవశాత్తు డ్రైనేజీలో పడి మృతి చెందిన ఘటన నేలకొండపల్లి మండలం శంకరగిరితండాలో జరిగింది.స్థానికుల కథనం ప్రకారం.. శంకరగిరితండా గ్రామానికి చెందిన తేజావత్ బాలా (60) అనే వృద్ధుడు బుధవారం రాత్రి గ్రామంలో వినాయక మండపం వద్ద జరిగిన అన్నదాన కార్యక్రమంలో భోజనం చేసి తిరిగి ఇంటికి వస్తుండగా ప్రమాదవశాత్తు మురుగు కాలువలో పడ్డాడు.చీకటి, వర్షం కారణంగా కుటుంబ సభ్యులు, గ్రామస్థులు గమనించలేదు. గురువారం తెల్లవారుజామున డ్రైనేజీలో విగతజీవిగా పడి ఉండటాన్ని గుర్తించారు.

# ఘనంగా గణేష్ నిమజ్జనం



**రామారెడ్డి , రాజముద్ర న్యూస్:** రామారెడ్డి మండల కేంద్రంలో అంగరంగ వైభవంగా ఝాన్సీ రాణి సైన్యం ఆధ్వర్యంలో పటేల్ చెరువులో గణేష్ విగ్రహాన్ని నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా మహిళలు, విద్యార్థినిలు ఆటపాటలతో గణపతి ముందు నృత్యాలు చేస్తూ ప్రజలను ఆకట్టుకున్నారు.

# అధికారులు విధులు సక్రమంగా నిర్వహించాలి

## జిల్లా పంచాయతీ అధికారి మురళి



రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా పంచాయతీ అధికారి మురళి

**రామారెడ్డి, రాజముద్ర న్యూస్:** అధికారులు విధులు సక్రమంగా నిర్వహించాలని కామారెడ్డి జిల్లా పంచాయతీ అధికారి మురళి పేర్కొన్నారు. రామారెడ్డి మండల కేంద్రంలో గ్రామపంచాయతీ కార్యాలయాన్ని గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అయన గ్రామ పంచాయతిల్లో ఎలాంటి తప్పిదాలు జరగకుండా అధికారులు విధులు సక్రమంగా నిర్వహించాలని సూచించారు. రామారెడ్డి పంచాయతీలో ఆన్ లైన్ లో మొబైల్ డాటా వెరిఫికేషన్, పర్యవేక్షించి త్వరగా పూర్తిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నాగేశ్వర్ గుప్తా, మండల పంచాయతి అధికారి త్రివేద్, గ్రామ పంచాయతీ కార్యదర్శి రాజు తదితరులు పాల్గొన్నారు.

# చేయూత పెన్షన్ల పై పరిశీలిస్తున్న ఎంపీడీవో నాగేశ్వర్ గుప్తా



వివరాలను సేకరిస్తున్న ఎంపీడీవో నాగేశ్వర్ గుప్తా

**రామారెడ్డి, రాజముద్ర న్యూస్:** రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న చేయూత పెన్షన్లపై గురువారం రామారెడ్డి ఎంపిడిఓ నాగేశ్వర్ గుప్తా పరిశీలించారు. ఈ సందర్భంగా అభ్యర్థుల వద్దకు వెళ్లి పూర్తి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి పొరపాట్లు జరగకుండా ఉండాలని కోరారు. అభ్యర్థుల ఇంటింటికి వెళ్లి తిరిగి పూర్తి వివరాలను సేకరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి రాజు, దుదుక నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా లడ్డూ వేలం..

## రూ.3.4 లక్షలకు దక్కించుకున్న జి. వాసు దేవరావు



**కూకట్ పల్లి, రాజముద్ర న్యూస్:** హైదరాబాద్ కూకట్‌పల్లి వివేకానంద నగర్ కాలనీలోని వివేకానంద నగర్ అపార్ట్‌మెంట్స్ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన లడ్డూ వేలం ఉత్సాహంగా సాగింది. వినాయక నవరాత్రుల సందర్భంగా నిర్వహించిన లడ్డూ వేలంలో అపార్ట్‌మెంట్ వాసులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ వేలంలో జి. వాసు దేవరావు ఏకంగా రూ.3 లక్షల 40 వేల రూపాయలకు లడ్డూను దక్కించుకున్నారు. భక్తి, ఉత్సాహాల మధ్య జరిగిన ఈ వేలం కార్యక్రమం స్థానికంగా ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. భారీ మొత్తానికి లడ్డూ వేలం జరగడంతో నిర్వాహకులు, అపార్ట్‌మెంట్ వాసులు ఆనందం వ్యక్తం చేశారు.

# మావల ఘనంగా గణేష్ నిమజ్జన వేడుకలు

• ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎస్పీ, మున్సిపల్ చైర్పర్సన్, మార్కెట్ కమిటీ చైర్మన్



**రాజముద్ర న్యూస్, ఆదిలాబాద్:** మావల వద్ద ఏర్పాటు చేసిన గణేష్ మండపంలో గణేష్ నిమజ్జన వేడుకలు గురువారం అత్యంత వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజ కార్యక్రమాల్లో జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్, మున్సిపల్ చైర్పర్సన్ బండారి అనూషా సతీష్ దంపతులు, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొని స్వామి వారికి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. అనంతరం జరిగిన గణేష్ నిమజ్జన ఊరేగింపులో భక్తులతో కలిసి స్వయంగా గుస్సాడి వేషధారణలో పాల్గొని ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. భక్తులతో కలిసి నృత్యాలు చేస్తూ సందడి చేశారు. మావల గ్రామ పెద్దలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని గణనాథునికి ఘనంగా వీడ్కోలు పలికారు.

# ఇందిరమ్మ పథకంతో పేదల సొంతింటి కల సాధ్యం



**రాజముద్ర న్యూస్, భోరజ్:** ఇందిరమ్మ పథకంతో పేదల సొంతింటి కల సాధ్యమవుతుందని ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) ఉపాధ్యక్షుడు దీపక్రావు అన్నారు. మండలంలోని గిమ్మ గ్రామంలో కండెల కవిత– నవీన్ దంపతుల నూతన ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి గురువారం భూమిపూజ కార్యక్రమం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తుల సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కొబ్బరికాయ కొట్టి, శాస్త్రోక్తంగా భూమిపూజ నిర్వహించి ఇంటి నిర్మాణ పనులను ప్రారంభించారు. ప్రజా ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి పేదల అభివృద్ధికి పాటు పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ గిమ్మ సంతోష్రావు, యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతన్రావు, భోరజ్ మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# భారీ వర్షంలోనూ గణేశ మండపాల్లో ఎమ్మెల్యే రాగమయి పూజలు



**రాజముద్ర న్యూస్, సత్తుపల్లి:** భారీ వర్షాలు, తుఫాన్ పరిస్థితులు కొనసాగుతున్నప్పటికీ సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ గణేశ్ నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొన్నారు. సత్తుపల్లి మున్సిపాలిటీ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన గణేశ్ మండపాలను గురువారం సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులతో కలిసి గణేశ్ నిమజ్జన కార్యక్రమంలో పాల్గొన్నారు. జేవీఆర్ పార్క్, హనుమాన్నగర్, ఎన్టీఆర్ కాలనీ, బైపాస్ రోడ్, వేంసూరు రోడ్డులోని షాదీఖానా సమీప ప్రాంతం, నేతాజీ రోడ్తో పాటు వివిధ కాలనీలు, వార్డుల్లో ఏర్పాటు చేసిన గణేశ్ మండపాలను సందర్శించారు. మండపాల్లో నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో పాల్గొని గణనాథుడికి ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవ నిర్వాహకులు, భక్తులతో మాట్లాడి ఏర్పాట్ల వివరాలను తెలుసుకున్నారు. భారీ వర్షం కురుస్తున్నప్పటికీ భక్తులతో కలిసి గణేశ్ నిమజ్జన ఊరేగింపులో ఎమ్మెల్యే పాల్గొన్నారు. గణేశ్ నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమాల్లో సత్తుపల్లి మున్సిపల్ చైర్పర్సన్ రెహాన బేగం కమల్ పాషా, సత్తుపల్లి ఏఎంసీ చైర్మన్ దోమ ఆనంద్, సీనియర్ నాయకులు బొంతు వేణు సుమలత, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గాదె చెన్నారావు, మున్సిపల్ కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మహిళా కాంగ్రెస్, యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్యూఐ నాయకులు, భక్తులు, మహిళలు, ప్రజలు పాల్గొన్నారు.

# ప్రైవేట్ కోచింగ్ లో విద్యార్థులు,ప్రభుత్వ పాఠశాలలో హాజరు

- కమీషన్ల కోసం నయా మోసానికి తెరలేపిన ఉపాధ్యాయులు
- కూసుమంచి ప్రాథమిక పాఠశాలలో వెలుగు చూసిన వైనం
- ప్రజాపాలనలో భ్రష్టు పడుతున్న విద్యా వ్యవస్థ
- పర్యవేక్షణలో ఉత్సవ విగ్రహంగా మండల విద్యాధికారి




**ఖమ్మం రాజముద్ర న్యూస్:** పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలనే లక్ష్యంతో ప్రజా ప్రభుత్వం పనిచేస్తుంటే ప్రభుత్వ ఉపాధ్యాయులు మాత్రం ప్రైవేట్ కోచింగ్ సెంటర్లకు దాసోహం చేస్తున్నారు.కమీషన్ల కోసం కక్కుర్తి పడి ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులను నిబంధనలకు విరుద్ధంగా అనుమతి లేని ప్రైవేట్ నవోదయ,గురుకుల కోచింగ్ సెంటర్లకు పంపిస్తూ ప్రభుత్వ విద్యను అపహాస్యం చేస్తున్నారు.కూసుమంచి మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో గత కొన్ని నెలలుగా జరుగుతున్న ఈ చీకటి దందాలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు,మరో ఉపాధ్యాయుడు స్వయంగా భాగస్వామ్యం అయ్యారనే ఆరోపణలు సర్వత్రా చర్చనీయాంశంగా మారాయి.ప్రాథమిక పాఠశాలకి సంబంధం లేని,ప్రైవేట్ కోచింగ్ సెంటర్లలో కోచింగ్ తీసుకునే విద్యార్థులకు ఇదే పాఠశాలలో చదువుతున్నట్లుగా ఉపాధ్యాయులు నిత్యం ఎఫ్ఆర్ఎస్ (ముఖ ఆధారిత హాజరు)వేస్తూ ప్రజా ప్రభుత్వాన్ని,విద్యాశాఖ ఉన్నతాధికారులను ఉద్దేశ్య పూర్వకంగా మోసం చేస్తున్నారని ప్రధాన ఆరోపణ.

**ఎఫ్ఆర్ఎస్ యాప్ అక్రమ వినియోగం?**

కోచింగ్ సెంటర్లలో చదివే విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలలో దొంగ హాజరు వేసుకుంటూ వచ్చిన ఉపాధ్యాయులకి నిత్యం వారి వద్దకి వెళ్లి ఎఫ్ఆర్ఎస్ యాప్ లో ఫోటో దింపడం ఇబ్బందిగా మారింది.దీంతో ప్రభుత్వ విద్యాశాఖ మార్గదర్శకాలకు వ్యతిరేకంగా ఏకంగా తల్లితండ్రుల చరవాణిలోనే ఎఫ్ఆర్ఎస్ యాప్ ను ఇన్ స్టాల్ చేసి గోప్యంగా ఉంచాల్సిన ప్రభుత్వ పాస్ వర్డ్,యూజర్ ఐడిని వారికి ఇచ్చి దుర్వినియోగం చేయడమే కాకుండా ఎంచక్కా వారితోనే ఫోటోలు దింపించడం మొదలుపెట్టారనే గుసగుసలు స్థానికుల్లో వినిపిస్తున్నాయి.యాప్ వినియోగం పై సదరు ఉపాధ్యాయుడు మదన మోహనుడు వలే శిక్షణను అందించారనే విమర్శలు గ్రామస్తుల్లో వెల్లువెత్తుతున్నాయి.

**ఉద్యోగానికే ఎసరు..షోకాజ్ తో దారిలోకి..**

దొంగ హాజరు అక్రమాల్లో భాగస్వామ్యం కలిగిన ఓ ఉపాధ్యాయుడుని ఇటీవల వర్క్ అడ్జస్ట్మెంట్ లో భాగంగా కిష్టాపురం ప్రాథమికోన్నత పాఠశాలకి వెళ్లాలని డిఈఓ ఆదేశాలు జారీచేశారు.ఈ నేపథ్యంలో ఉపాధ్యాయుడు డీఈఓ ఆదేశాలను బేఖాతరు చేస్తూ బదిలీ చేసిన పాఠశాలలో చేరలేదు.కూసుమంచిలో ప్రైవేటు కోచింగ్ సెంటర్ల వ్యవహారం,యూజర్ ఐడి, పాస్ వర్డ్ తల్లితండ్రులకు ఇచ్చిన గుట్టు రట్టయితే తన ఉద్యోగానికే ఎసరు వస్తుందని భావించి ప్రధానోపాధ్యాయుడు అండతో కిష్టాపురం వెళ్లేందుకు నిరాకరించి,రాజకీయ నాయకులతో సైతం పైరవీలు చేయించి విఫలమైనట్లుగా ప్రచారం జరుగుతుంది.తుదపరి ఎంఈఓ షోకాజ్ నోటీసు ఇచ్చిన అనంతరం ఆలస్యంగా అక్కడ విధుల్లో చేరడం కొసమెరుపు.ప్రభుత్వ నుండి వేతనం పొందుతూ ప్రజా ప్రభుత్వాన్ని మోసం చేస్తున్న ఇరువురు ఉపాధ్యాయుల లోగుట్టు కమీషన్ల దందా పై ఉన్నతాధికారులు విచారణ చేపడితే మరెన్నో అక్రమాలు వెలుగులోకి వస్తాయి.

# తలసిమియా సికిల్ సెల్ ఎనీమియా వ్యాధిపై అవగాహనా




**వికారాబాద్, రాజముద్ర న్యూస్:** గురువారం వికారాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయ మీటింగ్ హాల్ నందు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె సుధాకర్ లాల్ అధ్యక్షతన జిల్లా పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు గైనకాలజిస్టులు, పీడియాట్రిషన్లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, ఆయుష్మాన్ ఆరోగ్యం మందిర్లలో పనిచేస్తున్న ఎం.ఎల్.హెచ్.పి లకు తలసీమియా, సికిల్ సెల్ ఎనీమియా లపై ఒకరోజు ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. తలసీమియా, సికిల్ సెల్ సొసైటి హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమంలో టీఎస్ సిఎస్ సహవ్యవస్థాపకురాలు డాక్టర్ రత్నవల్లి, కోఆర్డినేటర్ హేమంత్ కుమార్ తలసిమియా, సికిల్ సెల్ ఎనీమియా వ్యాధి లక్షణాలు, నిర్ధారణ, చేయవలసిన పరీక్షలు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి మాట్లాడుతూ జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు వైద్యులందరూ కూడా తప్పకుండా స్పష్టమైన అవగాహనతో గర్భవతులలో ప్రాథమిక దశలోనే వ్యాధిని గుర్తించి చికిత్స ప్రారంభించినట్లయితే దుష్పరిణామాలు లేకుండా నివారించగలుగుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ అధికారులు డాక్టర్ వరలక్ష్మి , డాక్టర్ అమృత లక్ష్మి , డాక్టర్ జ్యోతి, డాక్టర్ పద్మ, డాక్టర్ విద్యాప్రియ పాల్గొన్నారు.

# శంకర్ పల్లి ఫ్లై ఓవర్పై భద్రత ఏర్పాట్లు పేరుకేనా...?

- నిమజ్జనానికి తగిన ఏర్పాట్లు చేయడంలో అధికారులు విఫలమయ్యారా...
- బుధవారం రాత్రి సంఘటన అధికారుల నిర్లక్ష్య పనితీరుకు నిదర్శనమా...
- తూ తూ మంత్రంగా ఏర్పాట్లపై స్థానికుల ఆగ్రహం...



**శంకర్ పల్లి, రాజముద్ర న్యూస్:** శంకర్ పల్లి మున్సిపల్ ఫతేపూర్ మూసీ ఫ్లైఓవర్పై బుధవారం రాత్రి నిమజ్జనం సందర్భంగా గణపతితో పాటు ఓ యువకుడు ప్రమాదవశాత్తు కిందపడిపోయాడు. అదృష్టవశాత్తు నీటిలో పడటంతో ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు. అదే యువకుడు నీటిలో కాకుండా నేలపై పడివుంటే పరిస్థితి మరోలా ఉండేది. కాళ్ళు, చేతులు విరగడమా లేక ప్రాణాలు పోవడం జరిగేది. అప్పుడు ఆ యువకుడి కుటుంబ పరిస్థితి ఇలా ఉండేది ఊహించుకుంటేనే ఆందోళన కలుగుతుంది. వినాయక నిమజ్జనాల నేపథ్యంలో ప్రజల భద్రత కోసం మునిసిపల్ అధికారులు, పోలీస్ శాఖ ప్రత్యేక ఏర్పాట్లు చేయాల్సిన సమయంలో ఈ ఘటన చోటుచేసుకోవడం పట్ల స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఫ్లైఓవర్పై రక్షణ చర్యలు, బారికేడ్లు, హెచ్చరిక బోర్డులు, నిమజ్జన ప్రాంతాల్లో భద్రతా ఏర్పాట్లు ఎంతవరకు ఉన్నాయన్నది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఒకవేళ యువకుడు నీటిలో కాకుండా కింద ఉన్న రాళ్ళ ప్రదేశంలో పడితే బాధ్యత ఎవరిది..? ప్రజల ప్రాణాలకు ముప్పు ఏర్పడిన తర్వాతే అధికారులుమేల్కొంటారా అని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిమజ్జన ఏర్పాట్లపై అధికారులు ముందస్తు భద్రతా చర్యలు తీసుకున్నారా..? లేక కేవలం ఏర్పాట్లు చేసినట్లు చూపించడానికే పరిమితమయ్యారా అన్న ప్రశ్నలు స్థానికుల నుంచి వినిపిస్తున్నాయి. అదృష్టవశాత్తు ఓ ప్రాణం నిలిచింది. మరోసారి ఇలాంటి ఘటన జరగకముందే సంబంధిత అధికారులు భద్రతా ఏర్పాట్లను సమీక్షించాల్సిన అవసరంఎంతైనా ఉంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వెంటనే తగిన చర్యలు తీసుకొని, పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని స్థానికుల కోరుతున్నారు.

# అక్టోబర్ 1 వరకు వయోవృద్ధుల సంక్షేమం, సాధికారత వారోత్సవాలు

**జిల్లా కలెక్టర్ కె.హరిత**



**రాజముద్ర న్యూస్, ఆసిఫాబాద్:** తెలంగాణ ప్రభుత్వం వికలాంగులు, వయోవృద్ధులు, ట్రాన్స్జెండర్ ల సాధికారత శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం–2026 సందర్భంగా ఈ నెల 24వ తేదీ నుండి అక్టోబర్ 1వ తేదీ వరకు వయోవృద్ధుల సంక్షేమం, సాధికారత వారోత్సవాలు ఈ నెల 24 నుండి అక్టోబర్ 1వ తేదీ వరకు నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కె.హరిత ఒక ప్రకటనలో తెలిపారు. సుదీర్ఘ జీవితాల కోసం వ్యవస్థలను పునరాలోచించడం అనే నినాదంతో వివిధ కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని, వారోత్సవాల్లో భాగంగా ఈ నెల 25న వయోవృద్ధుల ఆరోగ్యం, శ్రేయస్సు దినోత్సవం, 26న వృద్ధాశ్రమాల కోసం సామర్థ్య నిర్మాణ కార్యక్రమం, 28న సైబర్ భద్రత, డిజిటల్ అక్షరాస్యత, వృద్ధులపై జరిగే దుర్వినియోగం నుంచి రక్షణపై అవగాహన కార్యక్రమాలు, 29న తరాల మధ్య అనుబంధం, అభ్యాస దినోత్సవం, 30న చురుకైన వృద్ధాప్యం, ఆరోగ్య శ్రేయస్సు, తరాల మధ్య నడక కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. అక్టోబర్ 1న అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని రాష్ట్ర, జిల్లా స్థాయిలో ఘనంగా నిర్వహించడం జరుగుతుందని, వయోవృద్ధుల సంక్షేమం, ఆరోగ్యం, భద్రత, సామాజిక గౌరవం, సాధికారతపై ప్రజలలో అవగాహన కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. వయోవృద్ధులకు అవసరమైన సహాయం, సమాచారం, సేవల కోసం ఎల్డర్ లైన్ 14567 ను సంప్రదించవచ్చని తెలిపారు.

# ఆరేళ్ల బాలిక.. రూబిక్స్ క్యూబ్‌లో ప్రపంచ రికార్డు



**చైనా, సెప్టెంబర్ 24 :** వయసు కేవలం ఆరేళ్లు.. కానీ ప్రతిభ మాత్రం ప్రపంచస్థాయి. చైనాకు చెందిన లియాన్ యున్‌జి అలియాస్ 'జిజి' 3ఇ3 రూబిక్స్ క్యూబ్‌ను సగటున కేవలం 4.27 సెకన్లలో పరిష్కరించి మహిళల ప్రపంచ రికార్డు నెలకొల్పింది. 4.5 సెకన్లలోపు ఈ ఘనత సాధించిన తొలి మహిళగా చరిత్ర సృష్టించింది. సిచువాన్ ప్రావిన్స్‌లోని చెంగ్డూకు చెందిన లియాన్ ఈ సెప్టెంబరులోనే తన రికార్డును రెండుసార్లు మెరుగుపరుచుకుంది. వుహాన్‌లో జరిగిన ప్రపంచ క్యూబ్ సంఘం గుర్తింపు పొందిన పోటీలో తొలుత 4.52 సెకన్ల సగటు సమయాన్ని నమోదు చేసింది. ఆ తర్వాత కేవలం మూడు రోజులకే గ్వాంగ్‌జౌలో జరిగిన పోటీలో 4.27 సెకన్లకు మెరుగుపరిచింది. ఐదు ప్రయత్నాల సగటు సమయాన్ని రికార్డుగా పరిగణిస్తారు. ఇందులో ఒకసారి ఆమె కేవలం 3.54 సెకన్లలోనే క్యూబ్‌ను పరిష్కరించింది. నాలుగేళ్ల వయసులో తొలిసారి రూబిక్స్ క్యూబ్‌ను ప్రయత్నించిన లియాన్‌కు అప్పట్లో ఒక క్యూబ్‌ను పూర్తి చేసేందుకు 90 సెకన్లు పట్టేది. రెండేళ్లుగా రోజుకు రెండు నుంచి మూడు గంటలపాటు సాధన చేస్తూ.. క్యూబ్‌ను పరిష్కరించేందుకు అవసరమైన 1,300కు పైగా అల్గారిథమ్స్‌పై పట్టు సాధించింది. రూబిక్స్ క్యూబ్ సాధనతో పిల్లల్లో ఏకాగ్రత, జ్ఞాపకశక్తి, తార్కిక ఆలోచన, ప్రాదేశిక అవగాహన వంటి నైపుణ్యాలు పెరుగుతాయని లియాన్ తల్లి లిన్ యాంగ్జీ తెలిపారు. పోటీల్లో అత్యంత వేగంగా క్యూబ్‌ను పరిష్కరించిన అనంతరం లియాన్ ఆనందంతో గంతులు వేస్తున్న దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో ఆకట్టుకుంటున్నాయి. లియాన్ సాధించిన 4.27 సెకన్ల సగటు సమయాన్ని 3ఇ3ఇ3 విభాగంలో మహిళల కొత్త ప్రపంచ రికార్డుగా ప్రపంచ క్యూబ్ సంఘం అధికారికంగా గుర్తించింది. చిన్న వయసులోనే ప్రపంచ రికార్డు సాధించడంతో లియాన్ ప్రతిభపై ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి.



# రహానే టెక్నిక్ సచిన్‌ను గుర్తు చేస్తుంది: స్టీవ్ వా

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 24 :** భారత మాజీ టెస్టు కెప్టెన్ అజింక్య రహానే బ్యాటింగ్ టెక్నిక్ తనకు క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్‌ను గుర్తు చేస్తుందని ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ స్టీవ్ వా ప్రశంసించాడు. రహానే బ్యాటింగ్‌లోని కాంపాక్ట్ టెక్నిక్, చిన్న బ్యాక్‌లిఫ్ట్, సమతుల్యత, ప్రశాంతమైన ఆటతీరు సచిన్‌ను తలపిస్తాయని పేర్కొన్నాడు. రహానేను సచిన్ స్ఫూర్తిగా తీసుకుని తన ఆటను తీర్చిదిద్దుకున్నాడా? అని స్టీవ్ వా ప్రశ్నించాడు. దీనికి రహానే స్పందిస్తూ.. చిన్నప్పటి నుంచే సచిన్ తనకు ఆరాధ్య దైవమని చెప్పాడు. ముంబైలో పెరిగిన తనలాంటి ఎంతోమందికి సచిన్ రోల్ మోడల్ అని తెలిపాడు. చిన్నతనంలో క్రికెట్ ఆడేటప్పుడు సచిన్ బ్యాక్‌లిఫ్ట్, చేతుల కదలిక, స్ట్రెయిట్ డ్రైవ్‌ను అనుకరించేవాడినని గుర్తుచేసుకున్నాడు. తర్వాత ఫస్ట్‌క్లాస్, అంతర్జాతీయ క్రికెట్‌లో సచిన్‌తో కలిసి ఆడే అవకాశం రావడం తన అదృష్టమని రహానే పేర్కొన్నాడు. సచిన్‌ను చిన్నప్పటి నుంచే ఆరాధించిన తాను.. ఆయనతో కలిసి డ్రెస్సింగ్ రూమ్ పంచుకోవడం ప్రత్యేక అనుభూతి అని చెప్పాడు. సంభాషణ సరదాగా సాగుతున్న సమయంలో స్టీవ్ వా.. "సచిన్ అంత డబ్బు సంపాదించావా?" అని రహానేను అడిగాడు. దీనికి రహానే ఏమాత్రం తడుముకోకుండా.. "బహుశా ఇప్పటి నుంచి సంపాదిస్తానేమో" అంటూ చమత్కారంగా సమాధానం ఇచ్చాడు. దీంతో వీరిద్దరి సంభాషణకు సంబంధించిన అంశం ఆసక్తికరంగా మారింది. అంతర్జాతీయ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించిన రహానే ప్రస్తుతం స్టీవ్ వాకు చెందిన ఆమ్‌స్టర్‌డామ్ ఫ్లేమ్స్ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. యూరోపియన్ టీ20 ప్రీమియర్ లీగ్‌లో ఆడుతున్న రహానే టెక్నిక్, ప్రశాంత స్వభావాన్ని స్టీవ్ వా గతంలోనూ ప్రశంసించిన విషయం తెలిసిందే.

# ఆటగాళ్ల గాయాలపై సీఓఈ తీరుపై అశ్విన్ తీవ్ర విమర్శలు

**చైనా, సెప్టెంబర్ 24 :** భారత క్రికెటర్ల గాయాలు, పునరావాస (రిహాబిలిటేషన్) నిర్వహణ విషయంలో బెంగళూరులోని భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీఓఈ) తీరుపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ అంశంపై భారత మాజీ తిరోగమన బౌలర్ (ఆఫ్‌స్పిన్నర్) రవిచంద్రన్ అశ్విన్ తన యూట్యూబ్ వేదికగా మాట్లాడుతూ, ఆటగాళ్ల గాయాల నిర్వహణలో స్పష్టమైన జవాబుదారీతనం అవసరమని స్పష్టం చేశారు.ఆటగాళ్లపై విపరీతమైన పనిభారం పడుతున్న దృష్ట్యా టెస్టులు, వన్డేలు, టీ20 మూడు ఫార్మాట్లకు వేర్వేరు జట్లను సిద్ధం చేయాల్సిన సమయం వచ్చిందని అశ్విన్ అభిప్రాయపడ్డారు. తమిళనాడు ప్రీమియర్ లీగ్ కోసం అనుమతి కోరినప్పటికీ మిస్టరీ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తిని సీఓఈ సమయానికి విడుదల చేయకపోవడాన్ని ఆయన ఉదాహరణగా ప్రస్తావించారు. నెల రోజుల్లో కోలుకోవాల్సిన ఆటగాడు అక్కడ మూడు నుండి నాలుగు నెలల పాటు ఉండిపోవాల్సి రావడం సీఓఈ పనితీరును ప్రశ్నిస్తోందని పేర్కొన్నారు. ఇటీవల జస్‌ప్రీత్ బుమ్రా గాయంపై సీఓఈ మరియు జాతీయ ఎంపిక (సెలెక్షన్) కమిటీ మధ్య సరియైన సమాచారం లేకపోవడం వల్లనే ఆయన శ్రీలంక పర్యటనకు దూరమయ్యారనే వార్తలు వచ్చాయి. మరోవైపు, ఆటగాళ్లకు అనుసరించే శిక్షణ విధానాలు కూడా గాయాలకు కారణవ-



ుతాయని, 2015లో 'ఒలింపిక్ లిఫ్టింగ్' సాధన చేయడం వల్లనే తనకు నడుము పట్టుకుందని (సైడ్ స్ట్రెయిన్) అశ్విన్ గుర్తు చేసుకున్నారు. ఈ క్రమంలోనే గాయాల నిర్వహణను చక్కదిద్దేందుకు బీసీసీఐ నూతన క్రీడా విజ్ఞాన మరియు వైద్య విభాగం (స్పోర్ట్స్ సైన్స్ అండ్ మెడిసిన్) అధిపతి పోస్టుకు దరఖాస్తులను ఆహ్వానించింది.

# రోహిత్‌తో బంధం ప్రత్యేకం: గంభీర్

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 24 :** గౌతమ్ గంభీర్.. సీనియర్ ఆటగాడు రోహిత్ శర్మతో తనకున్న అనుబంధంపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. తమ మధ్య ఉన్నది కేవలం కెప్టెన్–కోచ్ సంబంధం మాత్రమే కాదని, ఇద్దరి ఆలోచనా విధానాలు ఒకరికొకరికి బాగా తెలుసని చెప్పాడు. వెస్టిండీస్‌తో వన్డే సిరీస్ నేపథ్యంలో గంభీర్ ఈ వ్యాఖ్యలు చేశాడు. రోహిత్ జట్టులోకి వచ్చినప్పటి నుంచే తమ మధ్య మంచి అనుబంధం ఉందని గంభీర్ తెలిపాడు. తాను సీనియర్ ఆటగాడిగా ఉన్న సమయంలో రోహిత్‌తో కలిసి పనిచేశానని గుర్తుచేశాడు. మైదానంలో కొన్నిసార్లు ఆలోచనలు వేర్వేరుగా ఉన్నప్పటికీ.. చివరికి జట్టు ప్రయోజనాలే ఇద్దరికీ ముఖ్యమని పేర్కొన్నాడు. 2024 జులైలో హెడ్ కోచ్‌గా బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి రోహిత్, సూర్యకుమార్ యాదవ్, శ్రేయస్ అయ్యర్, శుభ్‌మన్ గిల్‌తో కలిసి పనిచేశానని గంభీర్ చెప్పాడు. ఈ నలుగురిలోనూ జట్టుకే తొలి ప్రాధాన్యం ఇచ్చే లక్షణం ఉందని ప్రశంసించాడు. వ్యక్తిగత ప్రయోజనాల కంటే జట్టు విజయాన్నే ముందుగా చూసే కెప్టెన్లతో పనిచేయడం తన అదృష్టమని పేర్కొన్నాడు. శ్రేయస్ అయ్యర్‌లో నాయకత్వ లక్షణాలను 2018లోనే గుర్తించానని గంభీర్ తెలిపాడు. అప్పట్లో ఢిల్లీ జట్టు కెప్టెన్సీని అతనికి అప్పగించిన విషయాన్ని గుర్తుచేశాడు. ప్రస్తుతం మళ్లీ శ్రేయస్‌తో కలిసి పనిచేసే అవకాశం రావడం సంతోషంగా ఉందన్నాడు. శుభ్‌మన్ గిల్ టెస్టు కెప్టెన్సీని కూడా గంభీర్ ప్రశంసించాడు. ఇంగ్లండ్ వంటి కఠినమైన పర్యటనలో ఐదు టెస్టులకు నాయకత్వం వహించడం పెద్ద సవాలేనని, అయినప్పటికీ గిల్ ఆ సవాలును అద్భుతంగా స్వీకరించాడని చెప్పాడు. రాబోయే సంవత్సరాల్లో గిల్ నుంచి మరింత అత్యుత్తమ ప్రదర్శన చూడొచ్చని గంభీర్ విశ్వాసం వ్యక్తం చేశాడు.



# తండ్రి సలహాతో ఆర్యవీర్ సెహ్వాగ్ బ్యాటింగ్



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 24 :** భారత మాజీ డాషింగ్ ఓపెనర్ వీరేంద్ర సెహ్వాగ్ పెద్ద కుమారుడు ఆర్యవీర్ సెహ్వాగ్ క్రికెట్‌లో తన ప్రయాణాన్ని ప్రారంభించాడు. ఇటీవల భారత అండర్–19 జట్టు తరఫున ఆస్ట్రేలియాతో జరిగిన యువ వన్డే సిరీస్‌లో అరంగేట్రం చేసిన 18 ఏళ్ల ఆర్యవీర్.. మూడు మ్యాచ్‌ల్లో 28, 47, 34 పరుగులు చేశాడు. అంతకుముందు ఢిల్లీ ప్రీమియర్ లీగ్‌లో వెస్ట్ ఢిల్లీ లయన్స్‌కు ప్రాతినిధ్యం వహించాడు. ఆస్ట్రేలియాతో సిరీస్‌లో తన ప్రదర్శనపై ఆర్యవీర్ కొంత అసంతృప్తి వ్యక్తం చేశాడు. మూడు మ్యాచ్‌ల్లోనూ మంచి ఆరంభాలు లభించినా వాటిని భారీ స్కోర్లుగా మలచలేకపోయానని చెప్పాడు. చివరి మ్యాచ్‌లోనూ కుదు-రుకున్న తర్వాత సిక్స్ కొట్టే ప్రయత్నంలో ఔటవడం నిరాశ కలిగించిందని తెలిపాడు. క్రికెట్‌లో గుర్తింపు పొందాలంటే భారీ పరుగులు చేయడం ఎంతో ముఖ్యమని పేర్కొన్నాడు. తన ఇంటిపేరు, తండ్రి సాధించిన విజయాల వల్ల ఎలాంటి ఒత్తిడిని అనుభవించడం లేదని ఆర్యవీర్ స్పష్టం చేశాడు. వీరేంద్ర సెహ్వాగ్ వారసత్వం గురించి తాను గర్వపడుతున్నానని, ప్రశంసలు, విమర్శలను పట్టించుకోకుండా తన ఆట, ప్రక్రియపై దృష్టి పెట్టేలా మానసికంగా సిద్ధమవుతున్నానని చెప్పాడు. ఆస్ట్రేలియాతో అరంగేట్రం మ్యాచ్‌కు ముందు కొంత నర్వస్‌గా ఉన్నప్పటికీ.. ఆ జట్టు బౌలర్ల వేగాన్ని ఎదుర్కోవడం మంచి అనుభూతినిచ్చిందని ఆర్యవీర్ తెలిపాడు. ఈ సిరీస్ తనలో ఆత్మవిశ్వాసాన్ని పెంచిందని పేర్కొన్నాడు. తండ్రి వీరేంద్ర సెహ్వాగ్ ఇచ్చే సలహాలను కూడా ఆర్యవీర్ వెల్లడించాడు. బ్యాటింగ్‌ను సాధ్యమైనంత సింపుల్‌గా ఉంచుకోవాలని తన తండ్రి సూచిస్తారని చెప్పాడు. కొట్టగల బంతిని కొట్టాలని, వదిలేయాల్సిన బంతిని వదిలేయాలని, అవసరమైతే డిఫెన్స్ ఆడాలని చెబుతారని తెలిపాడు. సోషల్ మీడియాలో వచ్చే వ్యాఖ్యలను పట్టించుకోకుండా టెక్నిక్‌తో పాటు మానసిక దృఢత్వంపై దృష్టి పెట్టాలని తండ్రి సూచిస్తున్నారని ఆర్యవీర్ చెప్పాడు.

## ఆసియా క్రీడల్లో భారత్-పాక్ మ్యాచ్ ఎప్పుడంటే?

**నాగోయా, సెప్టెంబర్ 24 :** జపాన్‌లోని ఐచి–నగోయాలో జరుగుతున్న 20వ ఆసియా క్రీడల్లో పురుషుల క్రికెట్ పోటీలు సెప్టెంబరు 24 నుంచి ప్రారంభం కానున్నాయి. తొలి మ్యాచ్‌లో ఆతిథ్య జపాన్.. ఆఫ్ఘనిస్తాన్‌తో తలపడనుంది. ఆసియా క్రీడల చరిత్రలో క్రికెట్ పోటీలు నిర్వహించడం ఇది నాలుగోసారి. ఈసారి మొత్తం 10 జట్లు పతకాల కోసం పోటీ పడుతున్నాయి.

స్వర్ణం కోసం 10 జట్లు ర్యాంకింగ్‌ల ఆధారంగా భారత్, పాకిస్థాన్, శ్రీలంక, బంగ్లాదేశ్ నేరుగా క్వార్టర్ ఫైనల్స్‌కు అర్హత సాధించాయి. పూర్తి సభ్య దేశంగా ఆఫ్ఘనిస్తాన్ కూడా ప్రధాన డ్రాలో నేరుగా చోటు దక్కించుకుంది. క్వాలిఫికేషన్ రౌండ్ ద్వారా హాంకాంగ్, మలేషియా, నేపాల్, ఒమన్ అర్హత సాధించాయి. ఆతిథ్య దేశం కావడంతో జపాన్‌కు నేరుగా ప్రవేశం లభించింది.

భారత్–పాక్ మ్యాచ్ ఎప్పుడు?

ర్యాంకింగ్‌లో అగ్రస్థానంలో ఉన్న ఆరు జట్లలో జపాన్, ఆఫ్ఘనిస్తాన్, నేపాల్, ఒమన్, మలేషియా, హాంకాంగ్‌లను రెండు గ్రూపులుగా విభజించారు. ఒక్కో గ్రూపులో మూడు జట్లు ఉంటాయి. రౌండ్ రాబిన్ పద్ధతిలో జరిగే పోటీల్లో ప్రతి గ్రూపులో అగ్రస్థానంలో నిలిచే రెండు జట్లు క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకుంటాయి. క్వార్టర్ ఫైనల్స్‌లో ఈ నాలుగు జట్లు భారత్, పాకిస్థాన్, శ్రీలంక, బంగ్లాదేశ్‌తో తలపడతాయి. అనంతరం సెమీఫైనల్స్, ఫైనల్ జరుగుతాయి. ఈ ఫార్మాట్ ప్రకారం భారత్, పాకిస్థాన్ మధ్య మ్యాచ్ జరిగే అవకాశం ఫైనల్‌లోనే ఉంది. అయితే అందుకు ముందుగా రెండు జట్లూ తమ తమ క్వార్టర్, సెమీఫైనల్ మ్యాచ్‌ల్లో విజయం సాధించి తుదిపోరుకు అర్హత సాధించాల్సి ఉంటుంది

# "జార్జ్ క్రిష్'లో మానస వారణాసి



**హైదరాబాద్, సెప్టెంబర్ 24 :** హీరో శర్వానంద్, దర్శకుడు శ్రీను వైట్ల కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న చిత్రం 'జార్జ్ క్రిష్'. ఈ సినిమాలో కథానాయికగా మానస వారణాసిని ఎంపిక చేసినట్లు చిత్రబృందం ప్రకటించింది. శర్వానంద్‌కు జోడీగా ఆమె కనిపించనున్నారు. 'కపుల్ ఫ్రెండ్లీ' సినిమాతో ఇటీవల గుర్తింపు తెచ్చుకున్న మానస.. తన నటనతో ప్రశంసలు అందుకున్నారు. 'జార్జ్ క్రిష్'లో ఆమె పాత్రకు ప్రాధాన్యం ఉంటుందని చిత్ర వర్గాలు చెబుతున్నాయి. శర్వానంద్, శ్రీను వైట్ల తొలిసారి కలిసి పనిచేస్తుండటంతో ఈ సినిమాపై మొదటి నుంచే ఆసక్తి నెలకొంది. ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై అనిల్ సుంకర సమర్పణలో రామబ్రహ్మం సుంకర నిర్మిస్తున్నారు. అజయ్ సుంకర సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. సంక్రాంతి కానుకగా సినిమాను విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. శర్వానంద్‌కు సంక్రాంతి సెంటిమెంట్ ఉండటంతో సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి. ఇటీవలే పూజా కార్యక్రమాలతో సినిమా ప్రారంభమైంది. తొలి సన్నివేశానికి నిర్మాత సురేశ్‌బాబు కెమెరా స్విచ్ఛాన్ చేయగా.. ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ క్లాప్ కొట్టారు. తొలి షాట్‌కు శ్రీను వైట్ల దర్శకత్వం వహించారు. కేవీ గుహన్ ఛాయాగ్రహణం అందిస్తుండగా.. అనూప్ రూబెన్స్ సంగీతం సమకూరుస్తున్నారు. అవినాశ్ కొల్లా కళా దర్శకత్వం, అమర్ రెడ్డి కుడుముల ఎడిటింగ్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. నందు సవిరిగాన, గోపీ మోహన్ కథ అందిస్తున్నారు.




# 'సిగ్మా' చిత్ర ఆవిష్కరణ వేడుకకు చిరంజీవి

## అక్టోబర్ 2న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో సినిమా విడుదల.

**హైదరాబాద్, సెప్టెంబర్ 24 :** యువ నటుడు సందీప్ కిషన్ కథానాయకుడిగా నటిస్తున్న సరికొత్త చిత్రం 'సిగ్మా' ప్రచార కార్యక్రమాలు జోరందుకున్నాయి. సెప్టెంబర్ 25న హైదరాబాద్‌లోని పార్క్ హయత్‌లో సాయంత్రం 6 గంటలకు నిర్వహించనున్న ఈ చిత్ర పూర్వ విడుదల (ప్రీ-రిలీజ్) వేడుకకు టాలీవుడ్ అగ్ర నటుడు చిరంజీవి ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఈ విషయాన్ని నిర్మాణ సంస్థ సామాజిక మాధ్యమాల ద్వారా అధికారికంగా ప్రకటిచడంతో చిత్రంపై అంచనాలు పెరిగాయి.

తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ కుమారుడు జాసన్ సంజయ్ ఈ చిత్రంతో సంవిధానకర్తగా (దర్శకుడిగా) చిత్రసీమలోకి ప్రవేశిస్తుండటం విశేషం. సుభాస్కరన్ నేతృత్వంలోని 'లైకా ప్రొడక్షన్స్' నిర్మిస్తున్న ఈ చిత్రంలో ఫరియా అబ్దుల్లా కథానాయికగా నటించగా, తమన్ సంగీతాన్ని అందించారు. తెలుగు రాష్ట్రాలలో ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్ పంపిణీ చేస్తుండగా, గాంధీ జయంతి సందర్భంగా అక్టోబర్ 2న ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది.



# రష్మీ దేశాయ్ తొలినాళ్ల కష్టాలు చేదు అనుభవాలు

**ముంబై, సెప్టెంబర్ 24 :** బుల్లితెరపై ఎంతో సంతోషంగా కనిపించే నటీనటుల జీవితాల వెనుక తీవ్రమైన పోరాటాలు, కన్నీళ్లు దాగి ఉంటాయనడానికి ప్రముఖ టెలివిజన్ నటి, 'బిగ్ బాస్' ఫేమ్ రష్మీ దేశాయ్ ఎదుర్కొన్న పరిస్థితులే నిదర్శనంగా నిలుస్తున్నాయి. కెరీర్ ప్రారంభంలోనూ, ఆ తర్వాత వ్యక్తిగత జీవితంలోనూ తాను ఎదుర్కొన్న భయానక ఘటనలను, ఆర్థిక సంక్షోభాన్ని ఆమె ఒక సంభాషణలో గుర్తుచేసుకున్నారు. కేవలం 16 ఏళ్ల పిన్న వయసులోనే ఒక ఆడిషన్‌కు వెళ్లిన సమయంలో తీవ్ర చేదు అనుభవం ఎదురైందని ఆమె తెలిపారు. అక్కడ మరెవరూ లేకపోవడంతో సందేహం వచ్చిందని, ఒక వ్యక్తి తనకు మత్తు పదార్థం కలిపిన పానీయాన్ని ఇచ్చి స్పృహ కోల్పోయేలా చేసేందుకు ప్రయత్నించగా, వెంటనే అప్రమత్తమై అక్కడి నుంచి తప్పించుకుని బయటపడినట్లు వెల్లడించారు. అంతేకాకుండా భర్తతో విడిపోయిన అనంతరం తీవ్ర ఆర్థిక ఇబ్బందులను అనుభవించానని ఆమె పేర్కొన్నారు. ఇల్లు కొనుగోలు రుణాలతో పాటు రూ. 3.25 కోట్ల అప్పుల్లో ఉన్న సమయంలో చేస్తున్న ధారావాహిక కూడా ఆగిపోవడంతో రోడ్డున పడే పరిస్థితి వచ్చిందని చెప్పారు. ఆ క్లిష్ట సమయంలో నాలుగు రోజుల పాటు తన సొంత కారులోనే గడపాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రాథమిక దశలో చిన్న బడ్జెట్ చిత్రాల్లో నటిస్తూ కెరీర్ ప్రారంభించిన రష్మీ, ఆ తర్వాత హిందీ బుల్లితెరపై నటిగా, రియాలిటీ కార్యక్రమాల ద్వారా విశేషమైన గుర్తింపును సంపాదించుకున్నారు.

# 'గుండెనిండా గుడిగంటలు' అమూల్య గౌడ సందడి

**హైదరాబాద్, సెప్టెంబర్ 24 :** తెలుగు బుల్లితెరపై ప్రసారమయ్యే ధారావాహికలు, వాటిలోని నటీనటులు వెండితెర తారల స్థాయిలో విశేష ఆదరణ సొంతం చేసుకుంటున్నారు. ప్రస్తుతం 'స్టార్ మా' వేదికగా ప్రసారమవుతున్న ప్రముఖ ధారావాహిక 'గుండెనిండా గుడిగంటలు'లో 'మీనా' అనే పాత్రలో నటిస్తూ కన్నడ నటి అమూల్య గౌడ తెలుగు ప్రేక్షకులకు ఎంతో దగ్గరయ్యారు. కుటుంబ విలువలకు ప్రాధాన్యతనిచ్చే అమాయకపు అమ్మాయిగా భావోద్వేగ సన్నివేశాల్లో సహజ నటనను కనబరుస్తూ ఆమె మంచి ప్రజాదరణ పొందారు. గతంలో కన్నడ సీరియల్ 'శ్రీగౌరీ' ద్వారా నటనా ప్రయాణాన్ని ప్రారంభించి, అక్కడ 'బిగ్ బాస్' రియాలిటీ కార్యక్రమంలోనూ పాల్గొని అమూల్య మంచి పేరు సంపాదించుకున్నారు. ధారావాహికలో సాంప్రదాయ చీరకట్టులో కనిపించే ఈ నటి, సామాజిక మాధ్యమాలలో మాత్రం ఆధునిక దుస్తులతో కూడిన విభిన్న రూపాలతో (స్టైలిష్ లుక్స్) నెటిజన్లను ఆకట్టుకుంటున్నారు. ప్రస్తుతం ఈమెకు అంతర్జాలంలో 5 లక్షలకు పైగా అనుచరులు (ఫాలోవర్లు) ఉండగా, ఆమె పంచుకునే చిత్రాలు సామాజిక మాధ్యమాలలో విశేషంగా వైరల్ అవుతున్నాయి.



Printed, Published and Owned by **RAVU RAJITHA,** Printed at **KAKATHIYA PRINTERS,** LN Colony, Uppal IDA, Uppal. **Editor: RAVU NAGI REDDY. RAJAMUDRA PUBLICATIONS,** Peerzadiguda, Medchal - Malkajigiri Dist. Telangana - 98, **RNI NO : TELTEL/2024/86684,** Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com